TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

జీవితంలో
విలువలు నేర్పించేదే
నిజమైన విద్య
- అంబేడ్కర్

మల్కాజిగిరి | సంపుటి : 01 సంచిక : 13 | శుక్రవారం, ఫిబ్రవరి 13, 2026, | పేజీలు - 08 | వెల : 4/-

# మామునూరు విమానాశ్రయం పనులు ప్రారంభించండి

- దిల్లీలో రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు హాజరు కావాలని వినతి
- అనంతరం రామ్మోహన్ నాయుడు, అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం



న్యూ ఢిల్లీ :దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్? ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్రమంత్రిని విన్నవించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో కార్యక్రమం చేపడుతున్నట్లు రక్షణ మంత్రికి వివరించారు. 1948 ఫిబ్రవరిలో మహాత్ముని చితాభస్మాన్ని ఈసా, మూసీ సంగమంలో నిమజ్జనం చేశారని కేంద్ర మంత్రికి తెలియజేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు, బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు కేంద్రమంత్రికి తెలియజేశారు. రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ గురించి ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా పంచుకున్నారు.'ఫిబ్రవరి చివరి వారంలో ఈసా, మూసీ నదుల సంగమ ప్రాంతంలో తలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు' శంకుస్థాపన కార్యక్రమానికి వారిని ఆహ్వానించాను. అలాగే ఆ ప్రాంతానికి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గౌరవ కేంద్రమంత్రికి వివరించాను. 1948 ఫిబ్రవరిలో మహాత్ముని చితాభస్మాన్ని ఈసీ, మూసీ సంగమ స్థలిలో కలిపిన విషయాన్ని గుర్తు చేశాను. ప్రజా ప్రభుత్వం తలపెట్టిన మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా "గాంధీ సరోవర్" ప్రాజెక్టు చేపడుతున్నామని, శంకుస్థాపనకు రావాల్సిందిగా ఆహ్వానించాను.' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. రామ్మోహన్ నాయుడు తో సీఎం భేటీ : దిల్లీ పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 12.30 గంటలకు పౌరవిమాన యాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం భేటీ అయ్యారు. కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తయినట్లు తెలిపారు. ఈ మేరకు దానికి సంబంధించి అవసరమైన పనులు చేపట్టాలని సీఎం విన్నవించారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌కు పాల్వంచలో స్థలం గుర్తించినట్లు పేర్కొన్నారు. రామ్మోహన్? నాయుడుకు ఎయిర్‌పోర్టు స్థలానికి ఓఎల్ఎస్ సర్వే, ఫీజుబిలిటీ స్టడీ నిర్వహించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. అంతేకాకు ఒడా అంతర్గామ్ విమానాశ్రయానికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్ర యానికి అదనంగా 249.82 ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. భేటీ ముగిసిన అనంతరం రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం సమావేశం అయ్యారు. బుధవారం రాత్రి ఖర్గేతో భేటీ : దిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం అయ్యారు. అయనతో ఇటీవల జరిగిన దావోస్ పర్యటన, హార్వర్డ్?లో జరిగిన శిక్షణ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ కొందరు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే పార్లమెంటుకు వెళ్లి ఎంపీలను కలిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి.

## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కేసు నమోదు



సంగారెడ్డి, ఫిబ్రవరి 12: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులకు ఆటంకం కలిగించారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు పోలీసులు. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు. జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది.జగ్గారెడ్డి వివరణ. (బుధవారం) సంగారెడ్డి పోలింగ్ బూత్ వద్ద జరిగిన సంఘటనపై ప్రెస్‌నోట్‌లో వివరణ ఇచ్చారు జగ్గారెడ్డి. నిన్న సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ నాయకుడు అడ్డా అనే వ్యక్తిని సీఐ గల్లా పట్టుకొని ఈడ్చుకొచ్చి కొట్టారని తెలిపారు. తన పార్టీ నాయకుడిని రక్షించుకోవడానికి బూత్‌కు వెళ్లి సీఐని తిట్టాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మద్దతుగా సీఐ... తమ పార్టీ నాయకుడిని అవమానించారని తెలిపారు. కావాలని లా అండ్ ఆర్డర్ దెబ్బతినేట్లు చేసిన సీఐని తిట్టడం జరిగిందని జగ్గారెడ్డి వివరించారు.ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని.. కానీ పది మంది మధ్యలో తమ పార్టీ నాయకుడికి సీఐ చేసిన అవమానం పోగొట్టడానికి బూత్ దగ్గరకు వెళ్లాల్సి వచ్చిందని జగ్గారెడ్డి తెలిపారు. ఎన్నికల నిబంధనలను సీఐ లేదా తాను ఉల్లంఘించినా.. అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. అందరూ దానిని స్వాగతించాలని అన్నారు. న్యాయస్థానంలో ఎవరి తప్పు, ఎవరి ఒప్పు తేలుతుందని పేర్కొన్నారు. ఈ సంఘటనను నిన్న సాయంత్రం 5 గంటలకే వదిలేశానని చెప్పారు.మరోవైపు, నిన్న సంగారెడ్డిలో జరిగిన సంఘటనను కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో.. జగ్గారెడ్డి అధికారులపై దాడి చేస్తున్నారంటూ పదే పదే ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. 'గతంలో కేటీఆర్ ఒక పోలీసు అధికారిని బూత్ పదంతో తిట్టారు. హరీశ్ రావు పోలీసులను తన్ని, తిట్టి, తెలంగాణ పోలీసులను 'ఆంధ్రోళ్లకు పుట్టారా' అంటూ నీచంగా మాట్లాడారు' అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ముందుగా కేటీఆర్, హరీశ్ రావు తిట్టిన విషయాలకు సమాధానం చెప్పి, ఆ తర్వాత తన గురించి మాట్లాడితే బాగుంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హితవుపలికారు.

## గ్రేటర్ ఎన్నికలపై కేటీఆర్ ఫోకస్



హైదరాబాద్ :గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ సమక్షంలో శేరిలింగంపల్లి యువనాయకుడు జయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేశారు. వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని కేటీఆర్ ప్రశంసించారు. "మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగం పల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచిందని.. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారన్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అబద్ధాలు.. బీజేపీ శూన్యంరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. "వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి" అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని ఆయన పేర్కొన్నారు.నగరంలో కుప్పకూలిన శాంతి భద్రతలు కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు. "ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటాం" అని హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని ఆయన పేర్కొన్నారు.

## మాజీ మంత్రి అంబటి రాంబాబుకు మరో బిగ్‌షాక్. ఆ కేసులో 14 రోజుల రిమాండ్!


అమరావతి: మాజీ మంత్రి,నేత అంబటి రాంబాబుకు సిటీ సివిల్ కోర్ట్ బిగ్‌షాక్ ఇచ్చింది. 2023లో సంక్రాంతి సంబరాల్లో లక్కీడ్రా పేరుతో అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో ఆయనపై నమోదైన కేసులో అంబటి రాంబాబుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో బెయిల్‌పై విడుదలవుతారనుకున్న అంబటి రాంబాబు కోర్టు నుంచి మళ్లీ రాజమండ్రి జైలుకే వెళ్లాల్సి వచ్చింది. కోర్టు తీర్పులో ఈ నెల 26 వరకు ఆయన రిమాండ్‌లో ఉండనున్నారు.అయితే సీఎం చంద్రబాబును దూషించిన కేసులో, పట్టాభిపురం పోలీసులపై దౌర్జన్యం చేసిన కేసులో ఇప్పటికే అంబటి రాంబాబుకు బెయిల్ వచ్చింది. దీంతో ఆ బెయిల్ పత్రాలను తీసుకుని లాయర్లు రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లారు. ఇంతలో 2023లో సంక్రాంతి సందర్భంగా గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించి అక్రమాలకు పాల్పడ్డారని జనసేన నేతలు చేసిన ఫిర్యాదుతో గతంలో అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసిన పోలీసులు.

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా



న్యూ ఢిల్లీ :త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 3.60 లక్షల కోట్ల రూపాయల విలువైన ఆయుధాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. వీటిలో చాలా విమానాలను 'మేక్ ఇన్ ఇండియా' కింద భారత్‌లోనే తయారు చేయనున్నారు. అదే విధంగా, సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించే 'కాంబ్యాట్ క్షిపణుల' కొనుగోలుకు అనుమతి లభించింది. నిఘా, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ అవసరాల కోసం ఉపయోగించే ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లకు డీఏసీ ఆమోదం తెలిపింది. యాంటీ ట్యాంక్ మైన్స్, పీ-8ఐ విమానాలు, మెరైన్ గ్యాస్ టర్బైన్ జనరేటర్లు వంటి కీలక యుద్ధ పరికరాల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది.


## నా పక్కన పైరవీకారులు లేరు ఉద్యమకారులే ఉన్నారు



హైదరాబాద్, ఫిబ్రవరి 12: రాజకీయ పార్టీని తాను కచ్చితంగా స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కవిత.తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమకారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు.గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాలరాయబడ్డాయన్నారు.ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.

## సౌత్ బ్లాక్‌కు గుడ్‌బై


### ఇక సేవాతీర్థ్ నుంచి పీఎంవో విధులు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని బ్రిటీష్ కాలం నాటి ఆఫీసు బిల్డింగ్‌లు ఉన్న నార్త్, సౌత్ బ్లాకులను శుక్రవారం పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా కొత్తగా నిర్మించిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌కు మారనున్నది. అయితే ఆఫీసును మార్చడానికి ముందు .. శుక్రవారం ప్రధాని మోదీ( చివరిసారి క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేయనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు పాత ఆఫీసులో ఆ భేటీ ఉండనున్నది. లుటెన్స్ ఢిల్లీలోని రైసినా హిల్స్‌లో ఉన్న సౌత్ బ్లాకులో చివరిసారి కేంద్ర క్యాబినెట్ భేటీ జరగనున్నది.నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని పూర్తిగా షిఫ్ట్ చేశారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియేట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు హోంశాఖను తరలించారు. ఒక్క పీఎంవో మినహా ఆ కాంప్లెక్స్‌లో అన్ని ప్రభుత్వ మంత్రులు, శాఖల ఆఫీసులు ఉన్నాయి. సెంట్రల్ ఢిల్లీలోని ప్రత్యేక కాంప్లెక్స్‌లో పీఎంవోను నిర్మించారు. పీఎంవోను ఇక నుంచి సేవాతీర్థ్ అని పిలవనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ సేవాతీర్థ్, కర్తవ్యభవన్-1,2లను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం ఇవాళ ఓ ప్రకటన రిలీజ్ చేసింది.కొత్త ఆఫీసు బిల్డింగ్‌ను ప్రారంభించడంతో.. భారతీయ అధికార పరిపాలనా విభాగంలో కొత్త మైలురాయి చేరుకున్నట్లు అవుతుంది. ఆధునిక, పటిష్టమైన, సౌకర్యవంతమైన పరిపాలనా వ్యవస్థను అందిచే ఉద్దేశంతో కొత్త బిల్డింగ్‌లను నిర్మించినట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో దూరం దూరంగా ఉన్న వివిధ శాఖల ఆఫీసులను ఇప్పుడు ఒకే దగ్గరికి తీసుకువచ్చారు. పరిపాలనను మరింత సులభం చేయాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.తీర్థ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ సెక్రటేరియేట్, క్యాబినెట్ సెక్రటేరియేట్ ఉంటాయి. అయితే గతంలో ఇవన్నీ వేర్వేరు ప్రాంతాలను నుంచి ఆపరేట్ అయ్యేవి.

## లోకేష్ కొత్త ప్రయోగం

### రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా 'డిన్నర్ మీటింగ్స



అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయ వర్గాల్లో ఒక సరికొత్త సంప్రదాయానికి తెరలేపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, వారి కుటుంబ సభ్యులతో కలిసి 'ఆత్మీయ విందు' కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. ప్రజాప్రతినిధులతో వ్యక్తిగత సంబంధాలను బలోపేతం చేసుకోవడంతో పాటు, నియోజకవర్గాల అభివృద్ధిపై నేరుగా చర్చించేందుకు ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఈ విందు సమావేశాలను లోకేష్ ప్రారంభించారు.కుటుంబ సభ్యులతో కలిసి డిన్నర్.. అసలు ప్లాన్ ఇదే!సాధారణంగా రాజకీయ సమావేశాలు చాలా వాడి వేడిగా సాగుతుంటాయి. అయితే, లోకేష్ రూపొందించిన ఈ కొత్త విధానం ప్రకారం.. ప్రతిరోజూ సాయంత్రం ఒక పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సుమారు ఏడుగురు ఎమ్మెల్యేలు లేదా ఎమ్మెల్సీలు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ విందులో పాల్గొంటారు. రాజకీయ ఒత్తిళ్ల మధ్య ఉండే ప్రజాప్రతినిధుల యోగక్షేమాలు తెలుసుకోవడం ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశం. విందు సమయంలో నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి ప్రజల నుండి వస్తున్న విన్నపాలు, అభివృద్ధి అవసరాలపై లోకేష్ నేరుగా తెలుసుకొని దిశానిర్దేశం చేయనున్నారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఇవాళ చిత్తూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేల జీవిత భాగస్వాములు, పిల్లలను కూడా ఆహ్వానించడం విశేషం.

# ఈనెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**ఖానాపురం ఫిబ్రవరి12 (నమస్తే భారత్ ) :** ఖానాపురం మండలంలోని బాలుతండా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈనెల 15న శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి భోగ్ బండారో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాలుతండా బానోతు సునీతబాలకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలుతండా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి గిరిజన కుటుంబం హాజరై గిరిజన సమాజానికి ఆదర్శ గురువు, మహనీయుడు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయగలరని కోరారు.

# త్రిలింగేశ్వర స్వామి దేవాలయం శివరాత్రి వేడుకలకు సిద్ధం

**ఖానాపురం ఫిబ్రవరి12 (నమస్తే భారత్ ) :** ఖానాపురం మండలం బాలుతండా గ్రామంలోని శ్రీ త్రికూట త్రిలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 15న మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దేవరకొండ అన్వేష్ శాస్త్రి గ్రామ సర్పంచ్ బానోత్ సునిత బాలకృష్ణ ,పాలకవర్గసభ్యులు తెలిపారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహా శివరాత్రి కి ఆలయాన్ని సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు.

మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా ఆదివారం రోజున ఉపవాసంతో ప్రారంభమై సాయంకాల సమయంలో మహా శివుడికి కళ్యాణ మహోత్సవం జరుగును కావున భక్తులందరూ విచ్చేసి స్వామి వారి యొక్క కృపకు పాత్రులు కాగలరని కోరారు.





# భద్రాచలం బార్ అసోసియేషన్ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వినతిపత్రం సమర్పణ

**నమస్తే భారత్ భద్రాచలం ఆర్ సి రిపోర్టర్ కోట దిలీప్.:** షెడ్యూల్డ్ ఏరియా ప్రజల న్యాయ హక్కులను హరిస్తున్న జి.ఓ. ఆర్.టి. నెం.70 ను వెంటనే ఉపసంహరించుకోవాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.06-02-2026న తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఈ జి.ఓ. ద్వారా సివిల్ న్యాయ పరిపాలనను తిరిగి ఆర్డీవోలు / సబ్ కలెక్టర్లకు అప్పగించడం ప్రజల న్యాయ హక్కులపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని బార్ అధ్యక్షులు కోటా దేవదానం ఆగ్రహం వ్యక్తం చేశారు.మొబైల్ కోర్టులు ప్రజల న్యాయ భరోసా!1990లో ఏర్పాటు చేసిన మొబైల్ కోర్టులు దూర, గిరిజన ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించేందుకు స్థాపించబడ్డాయి. పేదలు, ఆదివాసీలు, అంతర్గత ప్రాంత ప్రజలు కోర్టు వద్దకు రావడం కష్టమైన సమయంలో ఈ కోర్టులు వారికి న్యాయం అందించాయి.ఇప్పుడు ఆ వ్యవస్థను బలహీనపరచడం అంటే షెడ్యూల్డ్ ఏరియా ప్రజలను న్యాయం నుండి దూరం



చేయడమే అని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం తీవ్రంగా విమర్శించి నారు చట్టపరమైన ఆధారం లేని నిర్ణయం!గత హైకోర్టు తీర్పుల్లో మొబైల్ కోర్టులు పరిమిత కాలానికి మాత్రమే ఏర్పాటు కాలేదని స్పష్టంగా పేర్కొనబడింది. అయినప్పటికీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే శ్రీ తెల్లం వెంకట్రావు గారిని కలిసి, గౌరవ ముఖ్యమంత్రి గారికి వినతిపత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి, సీనియర్ న్యాయవాదులు ఎంవి ప్రసాద్, కొడాలి శ్రీనివాసన్, కే శ్రీమన్నారాయణ, ఎం గణపతి రావు, రావి రామ్మోహన్, పేరాల నాగరాజు, పి. తిరుమల రావు, అవులూరి సత్యనారాయణ, పడిసి శ్రీనివాస్, చీమల నరసింహారావు, తాతా లలిత, అరుణ శ్రీ, రమా, పి భాస్కరరావు, బండి రాంప్రసాద్, తరుణి, రేఖ, అనిల్, కొరస కృష్ణార్జునరావు,, ఎం సంధ్యారాణి, సల్మా, గాయత్రి,, బి.రామకృష్ణ, కారం రమేష్, ఆశ్రిత పాల్గొన్నారు.

# ముస్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

## : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్







**నమస్తే భారత్: భద్రాద్రి కొత్తగూడెం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, ఎన్నికల నియమావళి ప్రకారం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.రేపు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, మొత్తం రెండు రౌండ్లలో 60 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో ఆబ్జర్వర్‌ను నియమించడంతో పాటు అవసరమైన రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఎన్నికల నియమావళి, ఓట్ల లెక్కింపు విధానం, అనుసరించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించామని వివరించారు. ప్రతి దశలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీల్ చేసి భద్రపరిచినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థులు లేదా వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌లను తెరవనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని, ప్రతి టేబుల్ వద్ద పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేందుకు ప్రత్యామ్నాయ జనరేటర్ సౌకర్యం కల్పించామని, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ...కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు స్థాయిల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. అనుమతిపత్రాలు కలిగిన సిబ్బంది, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు మరియు అధీకృత మీడియా ప్రతినిధులను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా బృందాలను మోహరించినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పరిధిలో చట్టవ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయుటకు సెక్షన్ 163-బి అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం ఐదుగురికిపైగా వ్యక్తులు గుమికూడరాదని, అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వదంతులు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక సైబర్ నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నియమావళి ప్రకారం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, పాల్వంచ డిఎస్పి సతీష్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలి: ఐటీడీఏ, పీవో బి.రాహుల్





**నమస్తే భారత్: భద్రాద్రి కొత్తగూడెం** గిరిజన సంక్షేమ ఆధ్వర్యంలో నడపబడుతున్న జిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు పునాది నుండే విద్యావ్యవస్థ బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ టు లోని అంశాలు ప్రతి పిల్లవానికి అందరికీ అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.గురువారం నాడు దుమ్ముగూడెం మండలంలోని మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలోని చత్తీస్గడ్ రాష్ట్రంకు ఆనుకొని ఉన్న లింగాపురం, రాజ గుంపు జిపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో కాసేపు ఉపాధ్యాయుని పాత్ర అనంతరం విద్యార్థి పాత్ర పోషించి ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన అంశాలు పిల్లలకు బోధిస్తున్న తీరును మరియు తానే స్వయంగా పిల్లల చేత బోర్డుపై వ్రాయించి వర్క్ బుక్ లోని ప్రతి అంశం పిల్లల ద్వారా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడంతో పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు చతుర్వేద ప్రక్రియలలో వెనుకబడి ఉన్నట్లు ఆయన గమనించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నెల రోజుల తర్వాత తప్పనిసరిగా ఈ పాఠశాలను సందర్శిస్తానని, ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా ప్రతి పిల్లవానికి తెలిసి ఉండాలని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరగాలని అన్నారు. పిల్లల హాజరు శాతం తక్కువగా ఉండకుండా చూసి, పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలా సంబంధిత ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ... ప్రతిరోజు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని, ఉపాధ్యాయులు ప్రతిరోజు వచ్చేలా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పై అధికారులు దృష్టికి తీసుకొని రావాలని, ఈసారి ఈ గ్రామం సందర్శించినప్పుడు తప్పనిసరిగా గ్రామంలోని పెద్దలు, పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వాహణ తప్పనిసరిగా పిల్లలు అర్థం చేసుకొని రాసేలా ఉపాధ్యాయులు పిల్లలను ఉత్తేజపరచాలని, సంబంధిత ఎస్సిఆర్పి క్రమం తప్పకుండా ఉద్దీపకంలోని ప్రతి అంశం ఉపాధ్యాయులు పిల్లలకు బోధిస్తున్నది లేనిది తనిఖీ చేయాలని, మారుమూల ప్రాంతాలలో ఉన్న జిపిఎస్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి ఆర్ పి విటల్ బాబు, ఉపాధ్యాయులు శ్రీమతి ముత్తమ్మ, చరణ్ కుమార్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు పునాది నుండే విద్య వ్యవస్థ బలోపేతం చేయాలి : ఐటీడీఏ, పీవో బి.రాహుల్






**వార్తాపత్రిక: భద్రాద్రి కొత్తగూడెం**
గిరిజన సంక్షేమ ఆధ్వర్యంలో నడపబడుతున్న జిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు పునాది నుండే విద్యావ్యవస్థ బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ టు లోని అంశాలు ప్రతి పిల్లవానికి అందరికీ అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.గురువారం నాడు దుమ్ముగూడెం మండలంలోని మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలోని చత్తీస్గడ్ రాష్ట్రంకు ఆనుకొని ఉన్న లింగాపురం, రాజ గుంపు జిపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో కాసేపు ఉపాధ్యాయుని పాత్ర అనంతరం విద్యార్థి పాత్ర పోషించి ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన అంశాలు పిల్లలకు బోధిస్తున్న తీరును మరియు తానే స్వయంగా పిల్లల చేత బోర్డుపై వ్రాయించి వర్క్ బుక్ లోని ప్రతి అంశం పిల్లల ద్వారా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడంతో పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు చతుర్వేద ప్రక్రియలలో వెనుకబడి ఉన్నట్లు ఆయన గమనించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నెల రోజుల తర్వాత తప్పనిసరిగా ఈ పాఠశాలను సందర్శిస్తానని, ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా ప్రతి పిల్లవానికి తెలిసి ఉండాలని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరగాలని అన్నారు. పిల్లల హాజరు శాతం తక్కువగా ఉండకుండా చూసి, పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలా సంబంధిత ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ... ప్రతిరోజు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని, ఉపాధ్యాయులు ప్రతిరోజు వచ్చేలా చూడాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పై అధికారులు దృష్టికి తీసుకొని రావాలని, ఈసారి ఈ గ్రామం సందర్శించినప్పుడు తప్పనిసరిగా గ్రామంలోని పెద్దలు, పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వాహణ తప్పనిసరిగా పిల్లలు అర్థం చేసుకొని రాసేలా ఉపాధ్యాయులు పిల్లలను ఉత్తేజపరచాలని, సంబంధిత ఎస్సిఆర్పి క్రమం తప్పకుండా ఉద్దీపకంలోని ప్రతి అంశం ఉపాధ్యాయులు పిల్లలకు బోధిస్తున్నది లేనిది తనిఖీ చేయాలని, మారుమూల ప్రాంతాలలో ఉన్న జిపిఎస్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి ఆర్ పి విటల్ బాబు, ఉపాధ్యాయులు శ్రీమతి ముత్తమ్మ, చరణ్ కుమార్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరులో సార్వత్రిక సమ్మె విజయవంతం

**- సమ్మెలో పాల్గొన్న కార్మికులందరికీ విప్లవ జేజేలు తెలిపిన అఖిలపక్ష కార్మిక సంఘాలు**






**నమస్తే భారత్:మణుగూరు**
29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్పు చేసి కార్పొరేట్ సంస్థలకు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే ప్రయత్నాలు ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో కార్మిక సంఘాల పిలుపులో భాగంగా గురువారం నాడు మణుగూరులో సార్వత్రిక సమ్మె విజయవంతం అయిందని ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు గురువారం ఉదయం నుండి జేఏసీ నాయకులు బృందాలుగా వివిధ గనులు డిపార్ట్మెంట్లలో సమ్మెను సమీక్షించారు అనంతరం బండారుగూడెంలో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు తహాశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు కొద్దిసేపు ధర్నా నిర్వహించి అనంతరం తహాశీల్దార్ అద్దంకి నరేష్ గారికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. ఇప్పటికైనా కేంద్రం నాలుగు లేబర్ కోడ్ ల అమలు ప్రయత్నాలు విరిగించుకోవాలని లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమానికి పలు రాజకీయ పార్టీలు కూడా సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు వై రాంగోపాల్, ఐ ఎన్ టి యు సి నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిఐటియు నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, టీబీజీకే నాయకులు నాగెల్లి వెంకట్, ఐ ఎఫ్ టి యు నాయకులు ఏ చంద్రం, టి యు సి ఐ నాయకులు ఆర్ మధుసూదన్ రెడ్డి,కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు జి వెంకటేశ్వర్లు, వెలగపల్లి జాన్,గద్దల శ్రీనివాస్, అంగోత్ మంగీలాల్, వీరభద్రం, సిపిఐ నాయకులు దుగ్యాల సుధాకర్, రాజబాబు, మహిళా సంఘం నాయకులు మున్నా లక్ష్మీకుమారి, కాంట్రాక్ట్ కార్మికులు ఇమామ్ బి, బత్తుల లక్ష్మణ్, పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ వైఎస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ విగ్రహావిష్కరణ



**నమస్తే భరత్:టేకులపల్లి,ఫిబ్రవరి12**
పూలమాలలు వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులుప్రసాద్ రాజకీయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం: లక్కినేని సురేందర్రావుటేకులపల్లి మండల పరిధిలోని సులానగర్ గ్రామంలో మాజీ వైఎస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం వారు ప్రసాద్ కుమారుడు ఉండేటి చెన్నయ్యను మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా పిఏసిఎస్ మాజీ చైర్మన్ లక్కినేని సురేందర్రావు మాట్లాడుతూ..ప్రసాద్ రాజకీయాలలో అందరికీ సుపరిచితుడైన నాయకుడని,ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శమని కొనియాడారు.గర్వం లేని వ్యక్తిగా,ప్రజల మనిషిగా ఆయన సంపాదించుకున్న కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్య దళ్సింగ్ నాయక్,టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్,సులానగర్ సర్పంచ్ గుగులోత్ లక్ష్మా,చుక్కలబోడు సర్పంచ్ బానోత్ రామానాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు బీఆర్ఎస్ మండల నాయకులు కిరణ్,బాలకృష్ణ, పూల్సింగ్, రమేష్,రాంకుమార్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# గొప్యతండాలో ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం









**నమస్తే భారత్:టేకులపల్లి,ఫిబ్రవరి,12** ఇల్లందు టీయూ,సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గంగారాం ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో గల గొప్య తండా గ్రామంలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా ఉచిత ఎక్స్-రే శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించి,తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ శిబిరంలో మొత్తం 49 మందికి ఎక్స్-రే పరీక్షలు నిర్వహించగా,అందులో టీబీ లక్షణాలు ఉన్నట్లు అనుమానించిన 24 మంది నుండి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు.ఈ కార్యక్రమంలో చంద్రు తండా సర్పంచ్ సంతోష,పంచాయతీ కార్యదర్శి రజిత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరితో పాటు హెల్త్ విజిటర్,టీబీ నోడల్ పర్సన్, ఎస్.టి.ఎస్,ఎం.ఎల్.హెచ్.పి,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఎక్స్-రే టెక్నీషియన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కట్టె నుండి 'బయోచార్' తయారీపై రైతులకు అవగాహన: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్







**నమస్తే భారత్:టేకులపల్లి,ఫిబ్రవరి12**
వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ,వ్యర్థాల నుండి సంపదను సృష్టించే దిశగా రైతులు అడుగులు వేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు.టేకులపల్లి మండలం, బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలోని తొమ్మిదో మైలు తండా రైతులకు నిర్వహించిన 'బయోచార్(పత్తి కట్టె నుండి బొగ్గు తయారీ)అవగాహన సదస్సు' లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.బయోచార్: భూమికి ప్రాణం పోసే సంజీవనిఈ సందర్భంగా కలెక్టర్ గారు బయోచార్ తయారీ విధానాన్ని మరియు దాని విశిష్టతను రైతులకు స్వయంగా వివరించారు.పంట అవశేషాలు,ముఖ్యంగా పత్తి కట్టెలు,చెట్ల వ్యర్థాలను 'పైరోలిసిస్' అనే ప్రక్రియ ద్వారా,ఆక్సిజన్ తక్కువగా ఉండే వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేయడం ద్వారా ఈ బొగ్గు లాంటి పదార్థాన్ని తయారు చేస్తారు.దీనిని మట్టిలో కలపడం వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది మరియు నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది.బయోచార్ ప్రయోగాత్మకంగా నేలలోని తేమను ఎక్కువ కాలం నిలిపి ఉంచుతుంది,ఇది వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు రక్షణగా నిలుస్తుంది.ఎటువంటి భారీ యంత్రాలు లేకుండా పొలాల్లోనే లభించే వ్యర్థాలతో అతి తక్కువ ఖర్చుతో రైతులు దీనిని తయారు చేసుకోవచ్చు.అజోల్లా పెంపకం మరియు బహుళ ఆదాయ మార్గాలుకార్యక్రమంలో భాగంగా కలెక్టర్ రైతు భద్రం చేనులో ఏర్పాటు చేసిన అజోల్లా పెంపకాన్ని పరిశీలించారు.అజోల్లాను పశుగ్రాసంగా వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా,ప్రతి రైతు కుటుంబం కనీసం 3 నుండి 4 రకాల ఆదాయ మార్గాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు.కౌజు పిట్టల పెంపకం,మేకల పెంపకం.మునగ తోటలు,కూరగాయల సాగు.చేపలు,పుట్టగొడుగులు మరియు తేనెటీగల పెంపకం ద్వారా నిరంతర ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.పర్యావరణ రక్షణలో బయోచార్ పాత్ర బయోచార్ కేవలం వ్యవసాయానికే కాకుండా శానిటేషన్ రంగంలోనూ మురుగునీటిలోని మలినాలను తొలగించి,నీటిని శుద్ధి చేయడానికి దీనిని ఉపయోగిస్తారు.పారిశ్రామిక వ్యర్థ జలాల వడపోతలో మరియు దుర్వాసన నియంత్రణలో ఇది అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుంది.పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల కలిగే గాలి కాలుష్యాన్ని నివారించి,కార్బన్ ఉద్గారాలను తగ్గించవచ్చు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో గౌరవ అడిషనల్ కలెక్టర్ డి ఆర్ డి ఓ విద్యా చందన,ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి,తహశీల్దార్ శ్రీ లంకా వీరభద్రం,సర్పంచులు ఊకే సునీత,బానోతు పూర్ణ,వ్యవసాయ అధికారి అన్నపూర్ణ,మరియు పలువురు అధికారులు,ఉపాధి హామీ సిబ్బంది,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 నుండి 16 వరకు కర్ణాటక రాష్ట్రం మంగళూరు లో నిర్వహించనున్న

**- అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనానికి రాహుల్ ఎంపిక.**



**నమస్తే భారత్:-వరంగల్** మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో, మేర యువ భారత్ వరంగల్ సమన్వయంతో వరంగల్ మండలానికి చెందిన రాహుల్ ఈ నెల 12 నుండి 16 వరకు కర్ణాటక రాష్ట్రం మంగళూరు లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమంలో పాల్గొననున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల యువత పాల్గొనే ఈ కార్యక్రమం యువతలో జాతీయ ఐక్యత, నాయకత్వ లక్షణాలు మరియు సాంస్కృతిక పరస్పర అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశ్యం.ఈ విషయాన్ని మేర యువ భారత్ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్ కుమార్ ఎంపిక కావడంతో వరంగల్ ప్రాంత ప్రజలు, యువజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మరిపెడలోసమ్మె

**- శ్రమశక్తి అభివృద్ధికి కారణం**




**నమస్తే భారత్:-మరిపెడ**
కార్మిక కర్షక శ్రమ లేకుండా ఈ సమాజం ముందుకు పోదని ఈ సమాజం ఆర్థిక అభివృద్ధికి కారణం కార్మికుల శ్రమ శక్తిని అన్నారు ఈరోజు దేశవ్యాప్త సమ్మె సందర్భంగా మరిపెడ బంగ్లా గవర్నమెంట్ హాస్పిటల్ లో సమ్మె కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజాసంఘాల నాయకులు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మరిపెడ ప్రాజెక్ట్ కార్యదర్శి కుమ్మరి కుంట్ల జ్యోతి కన్వీనర్ బానోత్ కవిత సీనియర్ నాయకురాలు కొండూరి రమాదేవి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దుండి వీరన్న వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కొండ ఉప్పలయ్య రై సంఘం మండల నాయకులు కందాల రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనటంజరిగింది. ఈ ఈ సమ్మెను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చి 11 సంవత్సరాలు అయినా ఇచ్చిన హామీలను పరిష్కరించకుండా కాలయాపన చేయడమే కాకుండా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులను బానిసలుగా మార్చేనాలుగు కోడ్స్ వాటిని తక్షణం రద్దు చేయాలని మధ్యతరగతి పేద ప్రజానీకానికి హాని కలిగించే ఆర్థికంగా నష్టం చేసేవిద్యుత్ సవరణ చట్టం 2025ను రద్దు చేయాలని మహాత్మా గాంధీజాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్నినిర్వీర్యం చేసే పేద ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులు పడవేసివిధంగా ఉన్నవి బి జి రామ్ చట్టం తక్షణమే రద్దు చేయాలని మాత్మ మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంగానే ఉండాలని రైతులకు నష్టం చేసేవిత్తన సవరణ బిల్లు రద్దు చేయాలనిఎల్ఐసి లో 100% ఎఫ్డిఐ రద్దు చేయాలని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని వారన్నారు లేనిపక్షంలో కార్మిక కర్షక ఐక్య ఫ్రెంట్ తో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పక తప్పదని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు కొండ వెంకన్న అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు రమాదేవి కవిత సరిత ఉమా రాజేశ్వరి మల్లికాంబ పార్వతి కవిత రూప మరియు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# 8 వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

**-సూర్య షోటోకన్ కరాటే అకాడమీ మాస్టర్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ**



**ములుగు జిల్లా(ప్రతినిధి)నమస్తే భారత్**
గురువారం ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారి చిత్రా మిశ్రా ఐఎస్ఐ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది మార్చి 1వ తారీకు శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర మేడారంలో జంపన్న భవనంలో సూర్య షోటోకన్ అకాడమీ ఫౌండర్ సెన్సహ పాయం సురేష్ తెలంగాణ పోలీస్ ట్రైనింగ్ అకాడమీ కోచ్, టెక్నికల్ డైరెక్టర్ గా తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ నిర్వహణ చేయనున్నారు ఈ టోర్నమెంట్ కి 18 జిల్లా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారు బాలురు మరియు బాలికలకు సబ్ జూనియర్ , జూనియర్, సీనియర్ విభాగాలలో క్రీడాలు ఉంటాయి అన్నారు టోర్నమెంట్ ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ టీ స్ దివాకరతో పాటు ముఖ్య అతిథులు మేడారంలో జరిగే కరాటే టోర్నమెంట్ హాజరవుతున్నారు 1500 మంది కరాటే క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొంటారు ఈ కార్యక్రమంలో మాస్టర్స్ కృష్ణయ్య, సంతోష్, రవిలు పాల్గొన్నారు

## మానవసేవే మాధవసేవ అంటూ ఎర్రబెల్లి గూడెం గ్రామ ప్రజలకు మెడికవర్ హాస్పిటల్ వరంగల్ వారిచే వైద్య ఆరోగ్య సేవలు అందించిన

### - గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్





**నమస్తే భారత్:-నెల్లికుదుర** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎర్రబెల్లి గూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉషా అశోక్ మరియు ఉపసర్పంచ్ సాంబమూర్తి . మెడికవర్ హాస్పిటల్ వరంగల్ వారిచే మెడికల్ క్యాంపు లో భాగంగా గ్రామ ప్రజల కు షుగర్ బిపి మరియు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది గ్రామ ప్రజలకు ఆరోగ్యం మరియు గుండె సమస్యల పట్ల గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి గ్రామంలో ప్రజలు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉండాలని వారికి మా వంతు సేవలు అందిస్తాం ఈ కార్యక్రమంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ రత్నం కార్తీక్ డాక్టర్ గిరి లోయ డాక్టర్ రాజ్ కుమార్ మరియు మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ హరిబాబు పి ఆర్ ఓ ప్రవీణ్ స్టాఫ్ నర్స్ ప్రేమలత శ్రావణి మరియు గ్రామ ప్రజలు వాసు అమ్మ అశోక్ మల్లయ్య విజేందర్ కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు

## ముస్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు - అధికారులకు ఈసీ దిశానిర్దేశం




ముస్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు శుక్రవారం వెల్లడి కానుంది. ఉదయం 8 గంటల 123 కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 ముస్సిపాల్టీల్లో 28 లక్షల 4వేల 274 ఓట్లు 7 కార్పొరేషన్లలో లక్ష 5 వేల 132 ఓట్లు లెక్కించాల్సి ఉంది. స్ట్రాంగ్ రూముల్లో 16 వేల 31 బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను భద్రపరిచారు.నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు : ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాల వెల్లడికి సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులకి రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ కేంద్రం వారీగా 25 బ్యాలెట్ పత్రాలని ఒక బండిల్‌గా చేసి లెక్కింపు చేపట్టనున్నారు. ఒక్కో రౌండ్‌కు 40 కట్టలు అంటే వెయ్యి ఓట్లను కౌంటింగ్ టేబుల్‌కు పంపిస్తారు. ఓట్లను ఏజెంట్లకు చూపించి అభ్యర్థుల వారీగా ట్రేలో వేస్తారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 100 చొప్పున బండిల్ చేస్తారు. రౌండ్లు, టేబుళ్ల వారీగా అభ్యర్థులు నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు చేసి చివరకి ఫలితాలు ప్రకటించనున్నారు.వారికి మాత్రమే అనుమతి : ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లని రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇచ్చింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఏజెంట్లకు మాత్రమే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని ఎస్?ఈసీ స్పష్టంచేసింది. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తులకు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని తెలిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎస్?ఈసీ, డీజీపీ, కలెక్టర్ల కార్యాలయాల్లో ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు.నిన్న జరిగిన ముస్సిపల్ ఎన్నికల్లో పట్టణాలు, నగరాలన్నీ కలిపి 73.01 శాతం పోలింగ్ నమోదైంది. ముస్సిపాలిటీల్లో 75.88, కార్పొరేషన్లలో 66.05 శాతం మంది ఓట్లు వేశారు. ముస్సిపాలిటీల్లో అత్యధికంగా చౌటుప్పల్‌లో 91.91 శాతం, అతి తక్కువగా నందికొండలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది. చౌటుప్పల్‌తో పాటు చండూరు, జిన్నారం, పోచంపల్లి ముస్సిపాలిటీల్లో 90 శాతానికిపైగా ఓటర్లు ఓటు వేశారు.మహిళల ఓటింగ్ ఎక్కువ : 46 ముస్సిపాలిటీల్లో 80 శాతం, 51 ముస్సిపాలిటీల్లో 70 శాతం, 15 ముస్సిపాలిటీల్లో 60 శాతం దాటింది. రెండు కార్పొరేషన్లలో పోలింగ్ 70 శాతానికి పైగా, నాలుగింటిలో 60 శాతానికి పైగా నమోదైంది. కార్పొరేషన్లలో నల్గొండలో 77.36 శాతం, కొత్తగూడంలో 74.52, రామగుండంలో 69.32, మహబూబ్‌నగర్‌లో 67.73, మంచిర్యాలలో 64.90, కరీంనగర్‌లో 62.98, నిజామాబాద్‌లో 59.12 శాతం పోలింగ్ జరిగింది. పట్టణాలు, నగరాల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటింగ్?లో పాల్గొన్నారు. ముస్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నింటిలో కలిపి పురుషులు 72.63 శాతం ఓట్లేయగా, మహిళలు 73.39 శాతం మంది ఓటు వేశారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు:జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ హెచ్చరిక

**- సులానగర్ పి హెచ్ సి,టేకులపల్లి ఉప కేంద్రాల ఆకస్మిక తనిఖీ**
**- కే జీ బీ వీ పాఠశాల విద్యార్థినులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన**
**- జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని పిలుపు..లెప్రసీ పై విద్యార్థులతో ప్రతిజ్ఞ**





**నమస్తే భారత్:టేకులపల్లి,ఫిబ్రవరి,12**
ప్రజారోగ్య పరిరక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ స్పష్టం చేశారు.మండలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,టేకులపల్లి ఆరోగ్య ఉప కేంద్రం మరియు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కేజీబీవీ ఆయన ఆకస్మికంగా సందర్శించి,క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.పి హెచ్ సి లో సేవలపై ఆరా-రికార్డుల తనిఖీముందుగా సులానగర్ పి హెచ్ సి ని సందర్శించిన డి ఎం హెచ్ ఓ,ఆసుపత్రిలోని మందుల నిల్వ రిజిస్టర్లను,ల్యాబ్ రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి,వారికి అందుతున్న చికిత్స,సిబ్బంది తీరుపై ఆరా తీశారు. ముఖ్యంగా హై రిస్క్ గర్భిణీల జాబితాను పరిశీలించి,వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని,ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో లక్ష్యాలను చేరుకోవడంలో వెనకడుగు వేయకూడదని సిబ్బందిని హెచ్చరించారు.పరిశుభ్రత-మానవీయ విలువలపై సూచనలు అనంతరం టేకులపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన,ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. “రోగులు ఆసుపత్రికి వచ్చేది కేవలం మందుల కోసం మాత్రమే కాదు,వైద్యుల ఆదరణ కోసం కూడా” అని పేర్కొంటూ,రోగులతో ప్రేమపూర్వకంగా మెలగాలని సిబ్బందికి హితవు పలికారు.కేజీబీవీ విద్యార్థినులకు ‘ఆరోగ్య పాఠం’టేకుల పల్లి కేజీబీవీ పాఠశాల సందర్శన ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.హాస్టల్ వంటశాల,స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసిన ఆయన,విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు.అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి ఆరోగ్యకరమైన ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి అందిస్తున్న పోషకాహారాన్ని వృధా చేయవద్దని కోరారు.పీచు పదార్థం అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు,ప్రోటీన్లు లభించే చిక్కుళ్లు,పప్పు దిన్యాలు,పల్లీలు లని సూచించారు.నూడిల్స్,పానీపూరి,చిప్స్,కూల్ డ్రింక్స్ వంటి జంక్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల ఎదుగుదల దెబ్బతింటుందని ,మైదా మరియు కృత్రిమ రంగుల ఆహారానికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.సరైన ఆహారం,వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి చదువుల్లో,ఆటల్లో రాణించవచ్చని పేర్కొన్నారు.ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ టాబ్లెట్లు వాడాలని,చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.లెప్రసీపై అవగాహన - ప్రతిజ్ఞచివరగా,సమాజంలో కుష్టు వ్యాధి (లెప్రసీ)పట్ల ఉన్న వివక్షను తొలగించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించారు.వ్యాధి లక్షణాలను వివరించి,ముందస్తు చికిత్సతో దీనిని నయం చేయవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులందరితో కలిసి లెప్రసీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ పర్యటనలో వైద్యాధికారులు డాక్టర్ కందుల దినేష్,డాక్టర్ కంచర్ల వెంకటేష్,డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మోహన్,హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ దేవా,కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సంతు,వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక కోడ్‌లను తిప్పికొడదాం.. టేకులపల్లిలో అఖిలపక్షం ‘రణభేరి’!

**-బోడు సెంటర్‌లో భారీ ర్యాలీ..తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**
**-అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్**
**-కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని నినాదాలు**




**నమస్తే భారత్:టేకులపల్లి,ఫిబ్రవరి,12**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై టేకులపల్లి మండల కేంద్రంలో పోరుగర్జన వినిపించింది.సిపిఐ(ఏఐటీయూసీ)మరియు సిపిఎం (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం అఖిలపక్ష భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బోడు సెంటర్ వద్ద నిర్వహించిన నిరసన సభలో నాయకులు కేంద్ర తీరుపై నిప్పులు చెరిగారు.నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని,కార్మికుల హక్కులను కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.అంగన్వాడీల సమస్యలపై సమరంఅనంతరం అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసును తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్.ఐ-2 సౌజన్యకు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీ టీచర్లు,ఆయాలను ప్రభుత్వ టీచర్లుగా గుర్తించి,నెలకు రూ.26,000 కనీస వేతనం చెల్లించాలి.పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.ఆయాలకు కూడా రూ.20,000 మట్టి ఖర్చులు చెల్లించాలి.పెరిగిన ధరల ప్రకారం ఆరోగ్య లక్ష్మి మెనూ ఛార్జీలు పెంచాలి.గత కొన్ని నెలలుగా ఆగిపోయిన సెంటర్ అద్దెలు,గ్యాస్ బిల్లులు,వేతనాలను వెంటనే చెల్లించాలి.అర్హులైన టీచర్లకు సూపర్వైజర్ పదోన్నతులు కల్పించి,బదిలీల తర్వాతే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.2023లో 24 రోజుల పాటు చేసిన సమ్మె కాలం వేతనాన్ని తక్షణమే విడుదల చేయాలి.పాల్గొన్న ప్రతినిధులుఈ పోరాట కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు గుగులోతు రామ్ చందర్,రాయల ఇందిరా,సంధ్యారాణి,సుగుణ, పద్మ,బిచ్చాలి..అలాగే సిఐటియు జిల్లా నాయకులు ఈసం నరసింహారావు,కే వీరన్న,కే శకుంతల,రాజేశ్వరి తదితరులు పాల్గొని ప్రసంగించారు. సమస్యలు పరిష్కరించని యెడల ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

# బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదు:జేఏసీ నాయకుల ధ్వజం

**నమస్తే భారత్:టేకులపల్లి,ఫిబ్రవరి12** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి గద్దె దించుతామని టేకులపల్లి జేఏసీ నాయకులు డి ప్రసాద్ సుల్తానా రామచందర్ జరుపల సుందర్ అన్నారు.దేశవ్యాప్తంగా సమ్మెలో భాగంగా టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం సెంటర్ నుండి బోడు రోడ్డు సెంటర్ వరకు ప్రదర్శన అనంతరం మానవహారాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్(ఐ ఎఫ్ టి యు) టేకులపల్లి మండల అధ్యక్షుడు మూడు బిచ్చు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలపై కార్మిక వర్గంపై తాను నల్ల చట్టాలను తీసుక వచ్చి చిత్తము వచ్చినట్లు వ్యవహరిస్తానని భావిస్తుందని భారతదేశం బిజెపి.పేటెంట్ గా భావిస్తుందని కాని గతంలో బిజెపి లాంటి కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబించిన ప్రభుత్వాలను ఈ దేశ ప్రజలు చూసి తగిన శాస్తి చెప్పారని అన్నారు.బిజెపి ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలను నల్ల చట్టాలను తీసుకువచ్చి కార్మికు వర్గంపై దాడి చేస్తానంటే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోరని తగిన గుణపాఠం చెప్పి తీరుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడుదుల వీరన్న కుంజ రమేష్,శకుంతల మూడు బిచ్చు,గుంటి భాస్కర్,దోమల రాజయ్య,ఈసం మహేష్,కత్తుల ఎర్రయ్య,మాడి వెంకటేశ్వర్లు,ప్రశాంత్,అన్నాజీ కానుగుల వెంకన్న జక్కుల వెంకన్న దేగటి క్రాంతి కుమార్ బోడా మంచ ఎట్టి నరసింహారావు,గుగులోతు రామచందర్,కల్తీ వెంకటేశ్వర్లు, ధర్మపురి వీర బ్రహ్మాచారి,మదర్ ఇందిరా సుగుణ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.







# గ్రామ ప్రజల అభివృద్ధే ఆత్మసంతృప్తి : సర్పంచి సువర్ణ రాజు

**- సర్పంచి సువర్ణరాజుకు ఘన సత్కారం**
**- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం.. భవిష్యత్తులో నిలిచిపోయే పనులు చేశారంటూ ప్రశంసలు**
**- సర్పంచి సువర్ణరాజు అభివృద్ధి పనులు అందరికీ ఆదర్శం**
**- అంత్యక్రియలకు తీవ్ర సమస్యగా మారిన స్మశాన వాటిక అభివృద్ధి పనులు మైలురాయి**




**పోడూరు, ( నమస్తే భారత్ ), జనవరి- 12 :** పోడూరు గ్రామ ప్రజల అభివృద్ధి నా ఆత్మసంతృప్తి అని గ్రామ సర్పంచి శెట్టి బత్తుల సువర్ణ రాజు అన్నారు. పోడూరు ప్రజల దీవెన ఆశీర్వాదాలు అండదండలతో గ్రామ సర్పంచి గా ఎన్నికైన తనకు గ్రామస్తుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో.. అవసరాలకు సేవలందించే భాగ్యము దక్కిందని, చిత్తశుద్ధి, నిబద్ధతతో గ్రామ పెద్దల సమాలోచనతో సహాయ సహకారాలతో మంచి పనులు చేసే అవకాశం తగ్గటం నా పూర్వజన్మ సుకృతం అని, గ్రామ ప్రజలందరికీ రుణపడి ఉంటారని, అవకాశాన్ని బట్టి పదవి కాలం ఆఖరి నిమిషం వరకు గ్రామస్తుల శ్రేయస్సు కే పని చేస్తారని అన్నారు. గురువారం పోడూరు నుంచి మినిమించిలిపాడు వెళ్లే రహదారి ప్రక్కన నిర్మించిన స్మశాన వాటిక ఆధునికరణ పనుల్లో భాగంగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామానికి చెందిన ఏడు సామాజిక వర్గాల 9 సంఘాలకు చెందిన ప్రజలు నాయకులు గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణ రాజును సాల్వాలు పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ర్యాలీగా స్మశానం వాటికకు గ్రామస్తులందరూ తరలివెళ్లి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.పోడూరు గ్రామ సర్పంచి సిట్టిబత్తుల సువర్ణరాజు సేవలు అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్ రాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రరాజు రవిరాజు అన్నారు.ఈ సందర్భంగా సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో పోడూరు గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన తనకు ప్రజల సేవ చేసే మహాభాగ్యం దక్కిందన్నారు. సిసి రహదారులు, సిసి డ్రైనేజీలు ప్రభుత్వ కార్యాలయాలు, స్మశాన వాటికల ఆధునీకరణ తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగించిందన్నారు. ఉప సర్పంచి జయరామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి పురుషోత్తం, నాయకులు చేకూరి సూరిబాబు మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాయిబాబా, ఏడు సామాజిక వర్గాల పెద్దలు, శ్రేష్టులు, కూటమి నాయకులు శ్రేష్టులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సముద్రం పక్కనే ఉన్నా తియ్యని నీరు ఎలా రామేశ్వరంలోని 22 తీర్థాల వెనక దాగిన రహస్యం ఇదే!



ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిల్లుతున్న రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా సైకత లింగాన్ని ప్రతిష్ఠించాడు. శ్రీరామ ప్రతిష్ఠిత లింగం ఉన్న క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రానికి రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరంలో శివ దర్శనానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో, అక్కడి పవిత్ర తీర్థాలలో స్నానానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 22 పవిత్ర తీర్థాలు ఉన్న రామేశ్వరం మోక్ష క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. రామేశ్వరంలోని ఈ తీర్థాలకు ఎందుకంత ప్రత్యేకత? ఈ తీర్థాల విశిష్టత ఏమిటి అనే అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

22 పవిత్ర తీర్థాలు

భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం చుట్టూ గల ద్వీపాలలో 64 పవిత్ర తీర్థాలు ఉన్నాయి. స్కాంద పురాణం ప్రకారం, వాటిలో 24 ముఖ్యమైనవి ఈ తీర్థాల్లో స్నానమాచరించడం తపస్సుతో సమానంగా భావిస్తారు. వాటిలో ప్రధాన తీర్థం "అగ్ని తీర్థం". అదే బంగాళా ఖాతం సముద్రం. శ్రీ రామేశ్వరుని దర్శించుకునే ముందు భక్తులు ముందుగా సముద్ర స్నానం చేయాలి. రెండవది రామేశ్వరానికి సమీపంలో ధనుష్కోటి మార్గంలో ఉన్న జటా తీర్థం. రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు ఇక్కడికి వచ్చి ఈ తీర్థంలో ముందుగా తన జటను తడుపుకుని ఆ తరువాత స్నానం చేశాడట. అందుకే ఈ తీర్థానికి 'జటా తీర్థం' అనే పేరు వచ్చింది. ఈ రెండు కాకుండా రామనాథస్వామి ఆలయ ప్రాంగణంలో మరో 22 పుణ్య తీర్థాలు ఉన్నాయి. వాటి విశిష్టతను తెలుసుకుందాం.

22 తీర్థాల విశిష్టత

22 అనే సంఖ్య రాముని అమ్ములపొదిలో గల 22 బాణాలకు నిదర్శనమని అంటారు. మొదటిదైన అగ్ని తీర్థం అనే సముద్ర స్నానం చేయాలి అనంతరం అలాగే తడిబట్టలతో నడుచుకుంటూ ఆలయం లోపలకు ప్రవేశించి అక్కడ ఉన్న 22 పవిత్ర తీర్థాలలో స్నానం చేసిన తర్వాత మాత్రమే పరమేశ్వరుని దర్శించుకోవాలి. ఇది ఆలయ సంప్రదాయం. ఈ తీర్థాల పేర్లు, వాటి ప్రత్యేకతను తెలుసుకుందాం. జటా తీర్థంలో మన వీలును బట్టి ఎప్పుడైనా స్నానం చేయవచ్చు.

22 తీర్థాల వెనుక పురాణ గాథ

రామేశ్వరం ఆలయ ప్రాంగణంలో ఉన్న తీర్థాలుగా పిలవబడే 22 బావుల ఉద్భవించడం వెనుక ఉన్న పురాణ గాథ చూద్దాం. రామాయణంలో శ్రీరాముడు రావణ సంహారం చేసిన అనంతరం రామేశ్వరంలో శివలింగ ప్రతిష్ట చేసి పూజించాడు. అయితే శివపూజ కోసం దివ్యతీర్థాలు కావాలి. రాముని భక్తి చూసిన సముద్ర దేవుడు ఒకే రాత్రిలో 22 పవిత్ర తీర్థాలు ఉద్భవింపజేశాడు. సముద్రానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ ఈ బావుల్లోని నీరు తియ్యగా ఉండడం ఈ తీర్థాల మహత్యాన్ని చాటుతుంది. అంతేకాదు ప్రతి బావిలోని నీరు రుచి, ఉష్ణత, గుణం వేరుగా ఉండటం వాటి ప్రత్యేకత! ఈ బావుల్లో ఒక్కో బావిలో స్నానం చేస్తే ఒక్కో ఫలితం 22 తీర్థాల పేర్లు, వాటి ప్రత్యేకత

1. మహాలక్ష్మీ తీర్థం!
మహాలక్ష్మి తీర్థంలో స్నానం చేస్తే ధన సంపదలు, ఐశ్వర్యం సిద్ధిస్తుంది. మనసు శుద్ధి అవుతుంది. దారిద్ర నివారించబడుతుంది.

2. సావిత్రీ తీర్థం!
సావిత్రీ తీర్థంలో స్నానం చేస్తే వాక్పటిమ, విద్య, మానసిక శక్తి, ప్రవచన శక్తి, గానం, వేదాధ్యయనం లో పురోగతి కలుగుతుంది.

3 .గాయత్రి తీర్థం!
గాయత్రీ తీర్థంలో స్నానం చేయడం వలన పాపక్షయం కలుగుతుంది. జపసిద్ధి, మానసిక ప్రశాంతత కలుగుతాయి.

4. సరస్వతి తీర్థం!
సరస్వతీ తీర్థంలో స్నానం చేస్తే మంచి విద్య, కళలలో అభివృద్ధి, వాక్శుద్ధి కలుగుతుంది. ఆర్జించిన జ్ఞానం పవిత్రమవుతుంది.

5. సేతు మాధవ తీర్థం!
ఈ తీర్థం రామసేతు వైభవానికి సూచకం. ఈ తీర్థంలో స్నానం చేస్తే కుటుంబ సమైక్యత, శు భకార్య సిద్ధి కలుగుతాయి.

6. గంధమాధన తీర్థం!
గంధమాధన తీర్థంలో స్నానం చేస్తే దేహం పవిత్రమవుతుంది. శారీరక రోగాలు తొలగుతాయి. మానసిక శాంతి లభిస్తుంది.

7. గవాక్ష తీర్థం!
గవాక్ష తీర్థంలో స్నానం చేస్తే సకల గ్రహ దోషాలు నివారణ అవుతాయి. శివదర్శనం సులభం అవుతుంది.

8. నల తీర్థం!
నల తీర్థంలో స్నాన చేస్తే శని బాధలు తొలగుతాయి. నల మహారాజు కృప వల్ల వివాహ యోగం, కుటుంబ ఐక్యత సిద్ధిస్తాయి.

9. నీల తీర్థం!
నీల తీర్థంలో స్నానం చేస్తే పరాక్రమం, శౌర్యం పెరుగుతాయి.

10. శంఖ తీర్థం!
శంఖ తీర్థం విష్ణు ప్రసాదమని విశ్వాసం. ఈ తీర్థంలో స్నానం చేస్తే సంపూర్ణ శాంతి, భయ నివారణ కలుగుతాయి.

11. చక్ర తీర్థం!
సుదర్శన చక్ర శక్తికి ప్రతీక ఈ తీర్థం. చక్ర తీర్థంలో స్నానం చేస్తే పాప నాశనం, కష్ట నివారణ కలుగుతాయి.

12. బ్రహ్మ హతీ విమోచన తీర్థం!
బ్రహ్మ హతీ విమోచన తీర్థంలో స్నానం చేస్తే బ్రహ్మహత్యా దోషం వంటి భయంకరమైన దోషాలు కూడా కూడా భస్మమవుతాయి. నూతన ప్రారంభాలు విజయవంతం అవుతాయి.

13. శివ తీర్థం!
ఈ తీర్థాన్ని పరమ శివానుగ్రహంగా భావిస్తారు. శివ తీర్థంలో స్నానం చేస్తే రోగాలు, అపశకునాలు శాంతిస్తాయి.

14. సూర్య తీర్థం!
సూర్య తీర్థంలో స్నానం చేస్తే పుణ్యఫలం, ఆరోగ్యం, ఓజస్సు, శరీర కాంతి వృద్ధి చెందుతాయి.

15. చంద్ర తీర్థం!
చంద్ర తీర్థం మానసిక శాంతికి కేంద్రం. ఈ తీర్థంలో స్నానం చేస్తే స్థిరమైన బుద్ధి కలుగుతుంది. కోపం నివారించబడుతుంది.

16. గంగా తీర్థం!
గంగా తీర్థంలో స్నానం చేస్తే అఖండ పాప పరిహారం అవుతుంది. జీవితంలో శు భప్రవాహాల పరంపర కొనసాగుతుంది.

17. యమునా తీర్థం!
యమునా తీర్థంలో స్నానం చేస్తే దారిద్ర నిర్మూలన, శాంతి, సౌమ్యత చేకూరుతాయి.

18. గోదావరి తీర్థం!
గోదావరి తీర్థంలో స్నానం చేస్తే ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది. శారీరక బలం పెరుగుతుంది. దీర్ఘాయుష్షు చేకూరుతుంది.

. సర్వ తీర్థం
సర్వ తీర్థంలో స్నానం చేయడం వలన సంస్కార శుద్ధి, కర్మ సిద్ధి కలుగుతుంది.

20. నర్మదా తీర్థం!
ఈ తీర్థం శక్తిమంత జలశుద్ధి కేంద్రం. నర్మదా తీర్థంలో స్నానం చేయడం వల్ల రుణ విమోచనం కలుగుతుంది.

21. సింధు తీర్థం!
సింధు తీర్థంలో స్నానం చేయడం వలన ప్రభావ శీలత, బల సంపత్తి కలుగుతాయి. విఘ్న నాశనం అవుతుంది. 2

22. కోటి తీర్థం!
ఇదే 22వ, అత్యంత శక్తివంతమైన బావి. అన్ని తీర్థాలలో కెల్లా విశిష్టమైనది కోటి తీర్థం. విశాలాక్షి అమ్మవారికి తూర్పు వైపున ఈ కోటి తీర్థం కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు తన మేనమామ కంసుని సంహరించిన తరువాత ఆ పాపాన్ని పోగొట్టుకోవడానికి ఈ తీర్థంలో స్నానం చేశాడని స్థల పురాణం చెబుతోంది. అన్ని బావుల సారాంశంగా ఈ తీర్థం పుణ్యఫలం ఇస్తుంది. 22 తీర్థాల స్నాన ఫలం

రామేశ్వర క్షేత్ర దర్శనానికి వెళ్లిన భక్తులు తప్పనిసరిగా సముద్ర స్నానంతో మొదలు పెట్టి ఈ 22 తీర్థాలలో స్నానం చేసిన తర్వాతనే రామ లింగేశ్వర స్వామిని దర్శించుకోవాలి. అప్పుడే రామేశ్వరం యాత్ర సఫలం అవుతుందని స్కంద పురాణంలో వివరించి ఉంది. ప్రతి మాసంలో పౌర్ణమి, అమావాస్య రోజులతో పాటు మకర సంక్రాంతి, రథసప్తమి, , మహాశివరాత్రి, సూర్య చంద్ర గ్రహణ సమయాల్లో ఈ తీర్థాల్లో లక్షలాదిమంది పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. మనం కూడా రామేశ్వరం వెళ్లి పుణ్య తీర్థాలలో స్నానం చేసి రామలింగేశ్వరుని దర్శించుకుని పునీతులమవుదాం.

ఓం నమః శివాయ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు శ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయంద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిల్లుతున్న రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా సైకత లింగాన్ని ప్రతిష్ఠించాడు. శ్రీరామ ప్రతిష్ఠిత లింగం ఉన్న క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రానికి రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరంలో శివ దర్శనానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో, అక్కడి పవిత్ర తీర్థాలలో స్నానానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 22 పవిత్ర తీర్థాలు ఉన్న రామేశ్వరం మోక్ష క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. రామేశ్వరంలోని ఈ తీర్థాలకు ఎందుకంత ప్రత్యేకత? ఈ తీర్థాల విశిష్టత ఏమిటి అనే అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

22 పవిత్ర తీర్థాలు

భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం చుట్టూ గల ద్వీపాలలో 64 పవిత్ర తీర్థాలు ఉన్నాయి. స్కాంద పురాణం ప్రకారం, వాటిలో 24 ముఖ్యమైనవి ఈ తీర్థాల్లో స్నానమాచరించడం తపస్సుతో సమానంగా భావిస్తారు. వాటిలో ప్రధాన తీర్థం "అగ్ని తీర్థం". అదే బంగాళా ఖాతం సముద్రం. శ్రీ రామేశ్వరుని దర్శించుకునే ముందు భక్తులు ముందుగా సముద్ర స్నానం చేయాలి. రెండవది రామేశ్వరానికి సమీపంలో ధనుష్కోటి మార్గంలో ఉన్న జటా తీర్థం. రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు ఇక్కడికి వచ్చి ఈ తీర్థంలో ముందుగా తన జటను తడుపుకుని ఆ తరువాత స్నానం చేశాడట. అందుకే ఈ తీర్థానికి 'జటా తీర్థం' అనే పేరు వచ్చింది. ఈ రెండు కాకుండా రామనాథస్వామి ఆలయ ప్రాంగణంలో మరో 22 పుణ్య తీర్థాలు ఉన్నాయి. వాటి విశిష్టతను తెలుసుకుందాం.ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిల్లుతున్న రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా సైకత లింగాన్ని ప్రతిష్ఠించాడు. శ్రీరామ ప్రతిష్ఠిత లింగం ఉన్న క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రానికి రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరంలో శివ దర్శనానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో, అక్కడి పవిత్ర తీర్థాలలో స్నానానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 22 పవిత్ర తీర్థాలు ఉన్న రామేశ్వరం మోక్ష క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. రామేశ్వరంలోని ఈ తీర్థాలకు ఎందుకంత ప్రత్యేకత? ఈ తీర్థాల విశిష్టత ఏమిటి అనే అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

22 పవిత్ర తీర్థాలు

భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం చుట్టూ గల ద్వీపాలలో 64 పవిత్ర తీర్థాలు ఉన్నాయి. స్కాంద పురాణం ప్రకారం, వాటిలో 24 ముఖ్యమైనవి ఈ తీర్థాల్లో స్నానమాచరించడం తపస్సుతో సమానంగా

# హైదరాబాద్‌లోనే మరో శిర్డీ -ఈ ఆలయంలో అడుగుపెట్టగానే మనసు ఎందుకు ప్రశాంతమవుతుందో తెలుసా?




మహారాష్ట్రలో మారుమూల గ్రామమైన శిర్డీ సాయినాథుని పవిత్ర చరణ స్పర్శతో పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రంగా మారింది. ఫకీరుగా పరిచయమైన సాయిబాబా భక్తుల హృదయాల్లో సద్గురువుగా, సత్యం గల దేవుడిగా శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఈ కారణంగానే ఆయనని ప్రతిరోజు దర్శించుకోవాలని, పూజించుకోవాలని భక్తులు తహతహలాడుతారు. అందుకోసం తమ గ్రామాల్లో ఆయనకి ఆలయాలు నిర్మించారు. భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేసి, హారతులిచ్చి ఆ స్వామి అనుగ్రహాన్ని పొందుతున్నారు. అలా భక్తులు నిర్మించుకున్న ఓ సాయిబాబా ఆలయ విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

దైవం మానవ రూపంలోసాయిబాబాను

దత్తాత్రేయ స్వరూపంగా భావించి పూజిస్తారు. సాక్షాత్తు త్రిమూర్తుల అంశ మానవ రూపంలో మన మధ్య కదలాడినందుకు చిహ్నంగా సాయిబాబాకు అనేక ఆలయ నిర్మించి భక్తులు తమ భక్తి విశ్వాసాలు చాటుకున్నారు. ఆ కోవలోకి చెందినదే హైదరాబాద్ హస్తినాపురంలో వెలసిన సాయినాథుని ఆలయం. ఈ ఆలయ విశేషాలు ఇప్పుడు చూద్దాం.ఆలయ విశేషాలుహైదరాబాద్ సరూర్ నగర్ మండల పరిధిలోని హస్తినాపురంలో వెలసిన సాయిబాబా ఆలయం సాయినాథుని పై భక్తులకు ఉన్న భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఎంతో మహిమాన్వితంగా భావించే ఈ ఆలయం ప్రశాంతమైన వాతావరణంలో వెలసి ఉంది. ఆలయంలోకి ప్రవేశించగానే పాపరాశిని ధ్వంసం చేసే ధుని కనిపిస్తుంది. భక్తులు ముందుగా ధునికి ప్రదక్షిణలు చేసి, వేపచెట్టు నీడలో గల గురు స్థానాన్ని దర్శించుకుంటారు. ఆ తరువాతే ప్రధాన మంటపంలో ప్రవేశిస్తారు.సమ్మోహనపరిచే బాబా విగ్రహంప్రధాన మండపంలోకి ప్రవేశించగానే వేదికపై చిరుమందహాసం చేస్తున్న సాయినాథుని దివ్య రూపం దర్శనమిస్తుంది. ఎంతటి క్లిష్టమైన సమస్యలు ఉన్నప్పటికీ ఒకసారి సాయినాథుని దర్శించుకోగానే మనసుకు ఒక విధమైన స్వాంతన చేకూరుతుందని భక్తులు అంటారు. ఈ ఆలయంలోకి అడుగు పెట్టిన భక్తులు సాయిని దర్శించగానే ప్రశాంతతను, ఉపశమనాన్ని పొందుతారు. ఇక ఆలయ ప్రాంగణంలో రామాలయం, ఆ పక్కనే గణపతి మందిరం, నవగ్రహాలను కూడా దర్శించుకోవచ్చు.పూజోత్సవాలుహస్తినాపురం సాయినాథుని ఆలయంల శిర్డీ సాయిబాబా ఆలయంలో జరిగినట్లుగానే ప్రతిరోజూ అభిషేకాలు, నాలుగు కాలాల్లో హారతి జరుగుతుంది. ప్రతి గురువారం పల్లకీసేవ, పవళింపు సేవలు ఘనంగా నిర్వహిస్తారు. ఇక్కడ బాబా పల్లకీని ఊరేగించడానికి అనుకూలంగా, ఆలయం విశాలమైన నాలుగు మాడ వీధులు ఉండడం విశేషంగా చెప్పుకోవాలి. ఇక ఏడాదికోసారి శ్రీరామనవమి ఉత్సవాలు, గురుపౌర్ణమి ఉత్సవాలు, ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.పల్లకి సేవలో పాల్గొనే విద్యార్థుహస్తినాపురం సాయినాథుని ఆలయంలో ప్రతి గురువారం జరిగే పల్లకి సేవలో ప్రత్యేకించి విద్యార్థులు ఎక్కువగా పాల్గొనడం విశేషం. సాయినాథుని పల్లకీ మోసిన విద్యార్థినీ విద్యార్థులు అత్యున్నతమైన స్థాయిలో ఉత్తీర్ణతను సాధిస్తూ, విదేశాల్లో సైతం ఉద్యోగాలను పొందుతూ వస్తున్నారు. అందువలన ఇక్కడి పల్లకీసేవలో యువతీ యువకులే ఎక్కువగా కనిపిస్తూ వుంటారు. అంతేకాదు వివాహం కావాల్సిన వారు ఒకసారి సాయినాథుని పల్లకి మోస్తే ఏడాది తిరిగేసరికల్లా వివాహం కావడం ఖాయమని కూడా భక్తులు చెబుతుంటారు.సబ్ కా మాలిక్ ఏక్!అనంతమైన ఈ విశ్వంలో ఉన్న భగవంతుని స్వరూపం ఒక్కటేనని, కులమతాలకు అతీతంగా అందరూ ఆ పరమాత్మను అనుసరించాలని లోకానికి చాటి చెప్పిన మహనీయుడు సాయిబాబా. ఆయన బోధించిన సూత్రాలను అనుసరించడం ద్వారా ఆధ్యాత్మిక మార్గంలో అలౌకిక ఆనందాన్ని పొందవచ్చు. మనకు అతి సమీపంలో ఉన్న హస్తినాపురం సాయినాథుని ఆలయాన్ని మనం కూడా దర్శిద్దాం సాయినాథుని అనుగ్రహాన్ని పొందుదాం.

ఓం శ్రీ సాయినాథాయ నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# తిన్న వెంటనే ఆకలిగా ఉంటుందా? - ఇలా ఎందుకు అవుతుందో తెలుసా?



ఆకలి వేస్తే భోజనం చేస్తాం. అనుకోకుండా నచ్చిన ఫుడ్ కనిపిస్తే జిహ్వా కోరికని తీర్చేస్తాం. అయిత్త ఎంత తిన్నా ఒక మోతాదు వరకే తీసుకోవాలి. కానీ, కొంతమంది మాత్రం ఆకలి తీరినా, ఎన్ని రకాల రుచులు ఆరగించినా ఇంకా ఏం తినాలా? ఎప్పుడు తినాలా? అని ఆలోచిస్తుంటారు. ఆకలి వేయకపోయినా సరే, మనసులో అవే ఆలోచనలు. దీన్నే 'ఫుడ్ నాయిస్' అంటున్నారు నిపుణులు. మానసిక ఒత్తిళ్లు, భావోద్వేగాల వల్ల జీవనశైలి, ఆహారంలో వచ్చే మార్పు అని చెబుతున్నారు. ఈ క్రమంలో 'ఫుడ్ నాయిస్' నియంత్రించుకోలేకపోతే ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!ఎలా గుర్తించాలి? : భోజనం చేసిన తర్వాత కడుపు నిండిన భావన. అయినా ఇంకేం తినాలి? అని ఆలోచన. బ్రేక్?ఫాస్ట్ తింటూనే మధ్యాహ్నం ఏం తింటే బాగుంటుందని, లంచ్ చేస్తూ సాయంత్రం స్నాక్స్ గురించి, ఆ తర్వాత రాత్రి భోజనం గురించి ఇలా మనసంతా ఎప్పుడూ ఫుడ్ గురించే ఆలోచిస్తుంటారు. ఒత్తిడికి లోనైనప్పుడు, బాధ కలిగినప్పుడు, ఖాళీగా ఉన్నప్పుడు ఇలా సందర్భం ఏదైనా సరే, ఆహారం తింటూ ఊరట పొందుతుంటారు. బరువు తగ్గడానికి డైట్‌లో ఉందామనీ అనుకుంటారు. అదే విధంగా మొదలు పెడతారు. కానీ, మామూలు రోజుల్లో కంటే మరింత ఎక్కువగా తినాలనిపిస్తుంటుంది. ఇవన్నీ ఫుడ్ నాయిస్‌కు సంకేతాలంటున్నారు నిపుణులు.చర్మం పొడిబారడం, జుట్టు రాలిపోవడం! – ఈ లక్షణాలు కనిపిస్తే అలర్ట్? కావాలంటున్న నిపుణులుఎందుకొస్తుంది? :

చాలా మంది బరువు పెరగకూడదని, ఫిట్‌నెస్ పేరుతో ఆహారం విషయంలో ఆంక్షలు పెట్టుకుంటారు. 'వీటి జోలికి వెళ్లకూడదు' 'అవి తినకూడదు' అని అనుకుంటారు. ఇలాంటప్పుడు ఆహారంపై ఆలోచనలు మరింత పెరుగుతాయి. నియంత్రించుకోవడం చాలా కష్టమవుతుంది.

మానసిక ఒత్తిడి పెరిగినప్పుడు, భావోద్వేగాలకు గురైనప్పుడు కొంతమందిలో ఏదైనా ఆహారం తినాలనే ఆలోచన వస్తుంటుంది. అలాంటి వారిలో బాధ, ఆందోళన, ఒంటరితనం, కోపం వంటివి ఫుడ్ నాయిస్‌ను పెంచుతాయి.సరిపడా నిద్ర లేకపోతే మెదడు ఉపశమనాన్ని కోరుకుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆలోచనలు ఫుడ్?పైకి మళు తాయి. ఏమైనా తినగానే మెదడు తక్షణ ఆనందాన్ని పొందుతుందట.

శరీరంలో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక మార్పులు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆకలి లేకపోయినా ఏమైనా తినాలనిపిస్తుందట. చాలామంది దీన్ని గుర్తించకలేక తినేస్తుంటారు.ఈ మధ్య సోషల్‌మీడియాలో ఫుడ్ వ్లాగ్ వీడియోలు పెరిగాయి. వివిధ ప్రాంతాల్లో ఉండే ఫుడ్‌ను పరిచయం చేస్తూ వ్లాగర్లు వీడియోలు యూట్యూబ్, సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ వీడియోలు, ప్రకటనలు చూసి నోరూరుతుంది.

ఆకలిని గుర్తించడం కష్టమే : 'ఆహారం మితంగా తింటే అమృతం, అతిగా తింటే విషం' అని అంటుంటారు పెద్దలు. ఫుడ్ నాయిస్ ప్రభావంతో అతిగా తినడం వల్ల బరువు నియంత్రణలో ఉండదు. శరీరంలోకి కొవ్వు పెరిగి ఒబెసిటీ వచ్చే ప్రమాదం ఉంది. నిజమైన ఆకలి ఏదో గుర్తించడం కష్టమవుతుందంటున్నారు నిపుణులు. అలాగే, బయట హోటల్స్, ఫుడ్‌స్టాల్స్‌లో పరిశుభ్రత ప్రశ్నార్థకంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. ఫుడ్ నాయిస్ వల్ల ఊబకాయంతో బాధపడవచ్చు, ఇది స్లీప్ అప్నియా, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌కు కూడా దారితీస్తుందని ఎశ్రీవజవశ్రీఖఅస అధ్యయనం పేర్కొందిఎలా నియంత్రించాలి? :

స్వయంగా లేదా డాక్టర్లు సాయంతో శరీరాన్ని అర్థం చేసుకోవాలి. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించాలి. నిజంగా ఆకలవుతోందా?భావోద్వేగాల కారణంగా అలా అనిపిస్తోందా అని ఒకటికి రెండు సార్లు మనల్ని ప్రశ్నించుకోవాలి.ఫుడ్ నాయిస్‌ను నియంత్రించుకోవాలని పూర్తిగా నోరు కట్టేసుకోవద్దు. ఇష్టమైన వాటికి దూరం పెట్టొద్దు. ఏది తిన్నా మితంగా, పోషక విలువలున్న సమతులాహారం తినడం మంచిది.

రోజూ వ్యాయామం చేయడం, తగినన్ని నీరు తాగడం, తగినంత నిద్ర తప్పనిసరి.తినే సమయంలో ఫోన్ వాడకుండా, టీవీ చూడకుండా తినే ఆహారంపైనే దృష్టి పెట్టాలి. రుచి, వాసనను ఆస్వాదిస్తూ భోజనం చేయాలి ఒంటరితనం, ఒత్తిడి, ఆందోళన వల్ల ఏదో ఒకటి తినాలపిస్తుంది. ఇలాంటప్పుడు వెంటనే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేయకుండా, కాసేపు నడవడం, కొన్ని క్షణాలు ధ్యానం చేయండి. వీలైతే కాసేపు సంగీతం వినండి. ఇంత చేసినా ఆకలి తీరకపోతే అప్పుడు జంక్‌ఫుడ్ కాకుండా పోషకాలనందించే ఆహారం తీసుకోండిచీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు..?

ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా..అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచితపథకాల గురింగి డిమాండ్ చేస్తున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఏమేమి చేశామో అని కాంగ్రెస్ వివరించింది. విపక్ష బిఆర్ఎస్ మాత్రం ఇవ్వని జాబితా చదివింది. తులం బంగారం ఇచ్చారా..రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీశారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇకపోతే ఇప్పటి లక్షా 25కోట్ల అప్పుల చేశారని అంటున్నారు. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో ఫలానా పథకం ఆగిందని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్ధిని చేకూర్చడం ఎంతవరకు సబబో నేతలు ఆలోచన చేయడం లేదు. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిం దని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతు లెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారతదేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకా నొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గతంలో హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడా వ్యతిరేకించాయి. మోడీకి సంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీ ఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లక్ష్మీమోహనాపథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల




వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథ కాన్నే ప్రకటించారు. బీహార్‌లో కూడా ఇలాంటి పథకంతోనే గట్టెక్కారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతేచేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయాను కూలంగా వాటిని మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నగదుబదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయితే ఉచిత మంత్రం అన్నిసార్లూ అందరికీ ఉపయోగపడదన్నది నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో కేజీవాల్, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జగన్ వంటి వారి ఓటమిని ఆపలేకపోయాయి. అందుకే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధిం చడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చ రిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డం కిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. ఎన్నికల సంఘం కూడా ఈ పథ కాల ప్రకటనలను నిషేధించాలి. ఒకసారి ఉచిత పథకాలు ప్రవేశ పెట్టాక వాటిని సమీక్షించుకునేందుకు ఏ ప్రభుత్వం ముం దుకు రావడం లేదు. కిలో రూపాయి బియ్యం ఇందుకు ఉదాహరణ.

## నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు రూ. 462.58కోట్లు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** గత నాలుగేళ్లుగా అంటే 2021-2025ల మధ్య కాలంలో ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల కోసం అక్షరాలా రూ. 462.58కోట్లు ఖర్చు చేసింది. 2021-2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే. మొత్తం వ్యయంలో 16శాతం (74.4కోట్లు) నాలుగుసార్లు అమెరికా సందర్శనలకు ఖర్చు చేశారు. వ్యయం పరంగా జపాన్, ఫ్రాన్స్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జపాన్, ఫ్రాన్స్‌ల కోసం మొత్తం వ్యయంలో సుమారు 9శాతం ఖర్చు చేశారు. 2025లో ఫ్రాన్స్ సందర్శన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలవనుంది. ప్రధాని మోడీ ఒక్కరే వెళ్లిన ఈ పర్యటన కోసం సుమారు 25.5కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గనడంతో పాటు మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ.22.8కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో అమెరికా సందర్శనకు రూ.19.6 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్శనల ఉద్దేశ్యం క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం. అమెరికా, యుఎఇ, జపాన్‌లలో ఒక్కో దేశాన్ని నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో ఒక్కోదేశాన్ని రెండు సార్లు సందర్శించారు. దౌత్య సంబంధాల బలోపేతం కోసం ఈ



పర్యటనలు చేసినట్లు ప్రధాని మోడీ పేర్కొన్నప్పటికీ.. దేశంలో ఓ వైపు ఇప్పటికీ ఆహారం, వసతి కోసం ఇబ్బందిపడుతుండటం గమనార్హం. ఈ సందర్శనల కోసం వినియోగించే ప్రభుత్వ వ్యయాన్ని ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికోసం ఖర్చు చేయాలని పలువురు మేధావులు, నిపుణులు పేర్కొంటున్నారు.విదేశీ ప్రయాణాల కోసం అత్యధదిక వ్యయంపై ప్రతిపక్షాలు గతంలో ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే.

## రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి



### • లోక్‌సభలో బిజెపి ఎంపి నిషికాంత్ దూబె తీర్మానం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ నిషికాంత్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని దూబే కోరారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రాహుల్ సోరస్ సంస్థతో చేతులు కలిపి దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ ఈరోజు లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. నేను ప్రతిపాదించిన తీర్మానంలో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితకాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అభ్యర్థించాను' అని అన్నారు. కాగా, నిన్న రాహుల్‌గాంధీ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని, భరతమాతను అమ్మేశారని వ్యాఖ్యానించారు. మరుసటి రోజే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశార. ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు.

## రైతుల ప్రయోజనాలపై మోడీ అబద్ధాలు

### వాణిజ్య ఒప్పందంపై పెద్ద ఎత్తున నిరసనలు

### భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని భారతీయ కిసాన్ యూనియన్ బికెయు ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను తగలబెడతామని తెలిపింది. బికెయు నేత రాకేశ్ తికాయత్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణ గురించి మోడీ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. 1992లో భారత్ తన ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచి విదేశాలను అనుమతించిందని, ప్రస్తుత పరిస్థితి కూడా అలాగే ఉన్నదని ఆయన చెప్పారు. 'భారత్-అమెరికా ఒప్పందం జరిగిన తీరు చూస్తుంటే అది మన దేశానికి ప్రమాదకారిగా కన్పిస్తోంది. కాబట్టి దానిపై మనం గళం విప్పాల్సిందే' అని అన్నారు. ఇది ఏకపక్ష ఒప్పందమని, ఒత్తిడితో కుదుర్చుకున్నదని తికాయత్ చెప్పారు. ఈ ఒప్పందం భారత రైతులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అమెరికా మన దేశంలోకి సబ్సిడీతో కూడిన వస్తువులను కుమ్మరిస్తుందని, ఫలితంగా మన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించలేరని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడతామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీని విలేకరులు ప్రస్తావించగా 'అది అబద్ధం చెబుతోంది. వారు ఏమైనా చెప్పుకోనివ్వండి. నిరసనలు తప్పవు' అని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను గ్రామాలలో రైతులు దగ్ధం చేస్తారని, ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతారని అన్నారు. 'మా ట్రాక్టర్లకు ఢిల్లీ ఎంతో దూరంలో లేదు. అవి సిద్ధంగానే ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందం భారత్‌కు న్యాయసమ్మతం కాదని ఆర్జేడీ ఎంపి సుధాకర్ సింగ్ చెప్పారు. ఇది ఉభయులకూ ప్రయోజనకరమైన ఒప్పందం కాదని, భారత్ 18 శాతం సుంకం కడుతుంటే అమెరికా మాత్రం సున్నా టారిఫ్‌కే పరిమితమవుతోందన్నారు. ప్రతిపాదిత విత్తన బిల్లును కూడా ఆయన వ్యతిరేకించారు. రైతులు అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. అమ్‌ఆద్మీ పార్టీ ఎంపి సంజరు సింగ్, ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

## కాన్పూర్‌లో పాదచారులపై లంబోర్గి కారు

### • ఘటనలో వ్యాపారవేత్త కుమారుడి అరెస్ట్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారుల పైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారును నడిపిన ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివంను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఈ అరెస్టు చోటుచేసుకుంది. కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం వేగంగా వస్తున్న లంబోర్గిని కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి అది దూసుకెళ్లింది. దీనికి ముందు ఈ లగ్జరీ కారు ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలో గురువారం ఉదయం అతడిని అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. బుధవారం ఈ కేసులో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన లంబోర్గిని కారును నడిపింది శివం కాదు.. తానే అంటూ మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు శివం మూర్ఛపోయాడని.. అతడిని ఒక చేత్తో పట్టుకొని కారు నడిపానని వెల్లడించారు. ఈ క్రమంలో కారు ఓ ఆటోని ఢీకొట్టిందని, ఆ తర్వాత డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయిందని వెల్లడించాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో లాకింగ్ సిస్టమ్ వల్ల తాను బయటకు రాలేకపోయానని, శివంను డ్రైవర్ సీటులోకి మార్చి.. తాను మరో సీటులోకి వెళ్లినట్లు వివరించాడు. అయితే, ప్రమాద సమయంలో కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసులు నిర్ధరించారు. ఘటన అనంతరం అతడిని డ్రైవర్ సీటు నుంచి బయటకు తీసిన వీడియోలు కూడా వెలువడ్డాయి. పోలీసుల వాదనలను గమనించిన న్యాయస్థానం మోహన్ లొంగిపోవడాన్ని నిరాకరించింది.

# పోస్టాఫీస్ సూపర్ స్కీమ్ - ఒక్కసారి ఇన్వెస్ట్ చేస్తే నెలనెలా ఆదాయం - రిస్క్ కూడా ఉండదు!



నేటి రోజుల్లో ఏ అవసరం ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి. అందుకే చాలా మంది ఎంతో కొంత పొదుపు చేయాలని భావిస్తున్నారు. అయితే సేవింగ్స్ విషయంలో కూడా కొన్ని రూల్స్ పాటిస్తున్నారు. రిస్క్ లేకుండా ఆదాయం వచ్చే స్కీమ్సలలో ఇన్వెస్ట్ చేయడానికి ఇంట్రస్ట్? చూపిస్తున్నారు. మరి మీరు కూడా ఇలానే ఆలోచిస్తున్నారా అయితే పోస్టాఫీసులో మీ కోసం అద్భుతమైన స్కీమ్? ఉంది. అదే మంత్లీ ఇన్‌కమ్‌స్కీమ్. ఒక్కసారి పెట్టుబడి పెడితే నెలనెలా ఆదాయం పొందవచ్చు. మరి ఈ పథకానికి ఎవరు అర్హులు ఎంత డిపాజిట్ చేయాలి సహా తదితర వివరాలు ఇప్పుడు చూద్దాం.సురక్షితంగా ప్టెబడి పెట్టి డబ్బు సంపాదించుకోవాలనుకునేవారికి పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్(గ్రూవీ×ూ) మంచి ఎంపిక అని నిపుణులు చెబుతున్నారు.? ఈ స్కీమ్‌లో చేరిన వారు ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలి. నెలనెలా ఇన్వెస్ట్? చేయడానికి ఇందులో అవకాశం ఉండదు. 5 సంవత్సరాలకు సరిపడా ఒక్కసారే పెట్టుబడి పెడితే, మెచ్యూరిటీ పూర్తయ్యే వరకు నెలవారీ ఆదాయం పొందొచ్చు.స్కీమ్‌వివరాలు భారతీయులు ఎవరైనా ఈ స్కీమ్‌లో చేరవచ్చు.ఈ పథకంలో భాగంగా రెండు ఖాతాలు ఉంటాయి. ఒకటి సింగిల్, రెండోది జాయింట్. సింగిల్? అయితే వ్యక్తిగతంగా, జాయింటుగా (గరిష్ఠంగా ముగ్గురు వ్యక్తులు) తెరవొచ్చు.10 ఏళ్లు నిండిన పిల్లల పేరుపై గార్డియన్ అకౌంట్ ఓపెన్‌చేయవచ్చు.ఈ పథకంలో కనీసం పెట్టుబడి రూ. 1,000. సింగిల్ ఖాతాలో గరిష్ఠంగా ూ.9 లక్షలు, జాయింట్? అకౌంట్?లో గరిష్ఠంగా రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టొచ్చు. అయితే 9 లక్షల లిమిట్? దాటకుండా ఎన్ని సింగిల్? ఖాతాలలో అయినా పెట్టుబడి పెట్టొచ్చు. అంటే ఒక అకౌంట్?లో రూ.3లక్షలు, రెండో అకౌంట్? రూ.4 లక్షలు, మూడో అకౌంట్?లో రూ.2 లక్షలు ఇలా ఎన్ని ఖాతాల్లో అయినా తొమ్మిది లక్షల పరిధి దాటకుండా పెట్టుబడి పెట్టొచ్చు.ప్రస్తుతం ఈ పథకంపై 7.4 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఈ వడ్డీ రేట్లు ప్రతి మూడు నెలలకు ఒకసారి మారతాయి. మీరు ఇన్వెస్ట్‌చేసే మొత్తాన్ని బట్టి మీకు నెలనెలా వడ్డీ లభిస్తుంది.ఈ ఖాతా తెరిచిన ఐదేళ్లకు మెచ్యూరిటీ పూర్తవుతుంది. మెచ్యూరిటీ పూర్తైనాక కావాలనుకుంటే పెట్టుబడిని మరో ఐదు సంవత్సరాలు పొడిగించుకోవచ్చు.ఎంత పెట్టుబడి పెడితే ఎంత వడ్డీ వస్తుంది: ఇక్కడ నెలనెలా వడ్డీ అనేది మీరు పెట్టే పెట్టుబడి మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు సింగిల్? ఖాతా తెరిచి రూ.లక్ష పెట్టుబడి పెడితే మీకు నెలకు రూ.600 పైన వడ్డీ లభిస్తుంది. అదే 3 లక్షలు అయితే నెలకు రూ.1,850, 5 లక్షలు అయితే నెలకు రూ.3వేలు, 9 లక్షలు అయితే నెలకు సుమారు రూ.5,500 వడ్డీ రూపంలో మీ చేతికి అందుతుంది. అదే మీరు జాయింట్ అకౌంట్ ఓపెన్‌చేసి గరిష్ఠంగా రూ.15 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే ప్రస్తుతం ఉన్న వడ్డీ ప్రకారం ప్రతి నెలా మీ అకౌంట్‌లో రూ.9,250 డిపాజిట్? అవుతుంది. అయితే ఈ వడ్డీ ప్రతి నెలా మీ అకౌంట్‌లో ఆటోమెటిక్?గా జమ అవుతుంది.ఖాతా క్లోజ్? చేయడానికి కొన్ని నిబంధనలు: అనుకోని కారణాల వల్ల ఖాతాదారులు మెచ్యూరిటీకి ముందే స్కీమ్‌ను క్లోజ్? చేయాలనుకుంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. పెట్టుబడి పెట్టిన సంవత్సరం తరవాత మాత్రమే డబ్బును విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల మధ్య విత్‌డ్రా చేస్తే డిపాజిట్ చేసిన నగదు నుంచి 2 శాతం తీసేసి మిగిలిన మొత్తం రీఫండ్ చేస్తారు. అదే అకౌంట్? ఓపెన్? చేసిన 3 సంవత్సరాల తరవాత అకౌంట్? క్లోజ్? చేయాలంటే ఒక శాతం నగదును తీసివేసి మిగతాది ఇస్తారు.

# పాకిస్థాన్‌తో వివాదం పీఎస్ఎల్ వేలానికి అఫ్గానిస్తాన్ ఆటగాళ్లు దూరం



లాహోర్ వేదికగా జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 11వ ఎడిషన్‌కు ముందు నిర్వహించిన ఆక్షన్‌లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. అఫ్గానిస్తాన్‌కు చెందిన పలువురు క్రికెటర్లు తమ పేర్లను వేలం నుంచి ఉపసంహరించుకున్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావం వల్ల వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ముజీబుర్ రెహ్మాన్, మహ్మద్ నబీ, ఫజల్ హక్ ఫారూఖీ, సిద్దికుల్లా అతల్, వకార్ సలామ్‌ఖేల్ వంటి ఆటగాళ్లు తొలుత వేలానికి రిజిస్టర్ అయినట్లు పీఎస్ఎల్‌లో ఓ ఫ్రాంచైజీ యజమాని వెల్లడించారు. అయితే పేషావర్ జల్మీ జట్టు రహ్మానుల్లా గుర్బాజ్ నేరుగా తీసుకోవడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో గుర్బాజ్ స్వయంగా పీఎస్ఎల్ నుంచి తప్పుకున్నాడు. ఆ తర్వాత మిగతా అఫ్గాన్ ఆటగాళ్లు కూడా వివాదాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో వేలం నుంచి తమ పేర్లు వెనక్కి తీసుకున్నట్లు సమాచారం.అయితే పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నసీర్ మాత్రం ఈ విషయంపై భిన్నంగా స్పందించారు. 'వేలంలో కొంత మంది అఫ్గాన్ ఆటగాళ్లు ఉన్నారు. కానీ ఏ ఫ్రాంచైజీ కూడా వారిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపలేదు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కూడా దీనికి కారణం అవ్వొచ్చు' అని తెలిపారు.కాగా గతేడాది పాకిస్థాన్ సైన్యం అఫ్గానిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాలపై వైమానిక దాడులు జరిపిన సంగతి తెలిసిందే. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ పరిణామాలపై అఫ్గాన్ ఆటగాళ్లు సోషల్ మీడియాలో స్పందించగా, పాకిస్థాన్ వర్గాల నుంచి కూడా ప్రతిస్పందనలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పీఎస్ఎల్ వేలంలో అఫ్గాన్ ఆటగాళ్ల ఉపసంహరణ క్రికెట్ వర్గాల్లో చర్చనీ యాంశమైంది.

# భారత్-పాక్ సమరానికి సై..సూర్య సేనను హెచ్చరించిన హిట్ మ్యాన్



ప్రపంచ క్రికెట్‌లో దేనికైనా సాటిరాని సమరం.. భారత్ వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా ఈ ఆదివారం (ఫిబ్రవరి 15) కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో దాయాదుల మధ్య పోరు జరగనుంది. ఈ హై వోల్టేజ్ మ్యాచ్ గురించి క్రికెట్ ప్రపంచమంతా ఫేవరెట్స్ ఎవరు అని చర్చిస్తుంటే, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం తనదైన స్టైల్లో స్పందించారు. గత చరిత్రతో పనిలేదని, ఆ రోజు ఎవరు బాగా ఆడితే వారే గెలుస్తారని హెచ్చరించారు.దుబాయ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రోహిత్ శర్మ మాట్లాడుతూ టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. "చాలామంది భారత్‌ను ఫేవరెట్ అంటున్నారు.. కానీ నేను ఆ పదాన్ని ఎప్పుడూ నమ్మలేదు. క్రికెట్ చాలా వింతైన ఆట. గత పదేళ్లలో ప్రపంచ క్రికెట్ చాలా మారిపోయింది. ఇప్పుడు చిన్న టీమ్స్ కూడా టీ20ల్లో బాగా ఆడుతున్నాయి. గతంలో మనం ఎన్ని మ్యాచ్‌లు గెలిచాం, ఎవరిపై పైచేయి సాధించాం అనేది ఆ రోజు లెక్కలోకి రాదు. మైదానంలో దిగాక ఏ జట్టు అయితే అత్యుత్తమ ప్రదర్శన ఇస్తుందో వారికే ఆ రెండు పాయింట్లు దక్కుతాయి. నిర్లక్ష్యంగా ఉంటే మాత్రం ఇంటికి ఖాళీ చేతులతో వెళ్లాల్సి వస్తుంది" అని రోహిత్ చాలా ఘాటుగా హెచ్చరించారు.టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్, పాకిస్థాన్ జట్లు ఇప్పటివరకు 8 సార్లు తలపడగా, భారత్ ఏకంగా 7 సార్లు గెలిచి ఏకపక్ష ఆధిపత్యం ప్రదర్శించింది. పాకిస్థాన్ కేవలం 2021లో మాత్రమే భారత్‌పై గెలిచింది. గతేడాది ఆసియా కప్‌లో మూడుసార్లు, గత రెండు టీ20 వరల్డ్ కప్‌లలో కూడా పాక్‌పై భారతే విజయం సాధించింది. అయితే, 2021లో బాబర్ ఆజం సారథ్యంలోని పాక్ జట్టు చేతిలో 10 వికెట్ల తేడాతో ఓడిపోయిన భారత జట్టులో రోహిత్ కూడా సభ్యుడే. అందుకే ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయొద్దని సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని ప్రస్తుత జట్టుకు ఆయన హితబోధ చేశారు.కొలంబోలోని ప్రేమదాస స్టేడియం సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ పాకిస్థాన్ బౌలర్లు కూడా పటిష్టంగా ఉండటంతో మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది. సూర్యకుమార్ యాదవ్ తన కెప్టెన్సీలో దాయాదుల పోరులో మొదటిసారి వరల్డ్ కప్ మ్యాచ్ ఆడబోతున్నారు. ఇప్పటికే వరల్డ్ నంబర్ 1 జట్టుగా ఉన్న భారత్, పాకిస్థాన్‌ను ఓడించి తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు పాక్ జట్టు గత పరాజయాలకు ప్రతీకారం తీర్చుకోవాలని ఎదురుచూస్తోంది.

# ఫస్ట్ టైమ్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారా అయితే ఇది తెలుసుకోండి.. అధిక రాబడి మార్గాలు!




మీరు మొదటిసారి మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తుంటే సరైన మార్గంలో ప్రారంభించడం చాలా ముఖ్యం. మార్కెట్ డైనమిక్స్ అనూహ్యంగా ఉండవచ్చు కాబట్టి, తొందరపడి పెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టడం కంటే వివేకంతో ముందుకు సాగడం మంచిది. కొత్త పెట్టుబడిదారులకు ఉత్తమ మార్గం ఏమిటంటే ఒకేసారి పూర్తి మొత్తాన్ని పెట్టుబడి పెట్టడం కంటే చిన్న మొత్తాలతో ప్రారంభించడం. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (ా×ూలు) దీనికి సులభమైన, సురక్షితమైన ఎంపిక. ా×ూలు ప్రతి నెలా స్థిర మొత్తాన్ని పెట్టుబడి పెట్టొచ్చు. ఇది మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని, ఖర్చు సగటు నుండి ప్రయోజనాలను తగ్గిస్తుంది. ఇది భావోద్వేగాల ఆధారంగా తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా ఉండటానికి కూడా మీకు సహాయపడుతుంది.హెల్తీ పోర్ట్‌ఫోలియో అంటే మీ డబ్బును వివిధ రకాల ఆస్తులలో సమతుల్య పద్ధతిలో పెట్టుబడి పెట్టడం. దీనిని ఆస్తి కేటాయింపు అంటారు. సాధారణంగా పోర్ట్‌ఫోలియోలో ఈక్విటీలు (స్టాక్ మార్కెట్-లింక్డ్ స్కీమ్‌లు), డెట్ (బాండ్లు లేదా స్థిర ఆదాయం), అంతర్జాతీయ పెట్టుబడులు, బంగారం లేదా ఇతర విలువైన లోహాలు ఉంటాయి. ఏడు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టడానికి సమయం ఉంటే, మీరు ఈక్విటీ ఫండ్లలో ఎక్కువ పెట్టుబడి పెట్టవచ్చు. అయితే మీరు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడకపోతే డెట్, బహుళ-ఆస్తి నిధులు మంచి ఎంపికలు కావచ్చు. మీ పెట్టుబడి వ్యూహం మీ ఆదాయం, ఖర్చులు, లక్ష్యాలు, రిస్క్ టాలరెన్స్ మీద ఆధారపడి ఉంటుంది.కొత్త పెట్టుబడిదారులు డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్స్ లేదా ఇండెక్స్ ఫండ్స్‌తో ప్రారంభించవచ్చు. ఇండెక్స్ ఫండ్స్ నిఫ్టీ 50 లేదా సెన్సెక్స్ వంటి ప్రధాన మార్కెట్ సూచీలను ట్రాక్ చేస్తాయి, కాబట్టి అవి ఫండ్ మేనేజర్ నిర్ణయాల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. అధిక అస్థిరతను అనుభవించకూడదని ఇష్టపడేవారు ఈక్విటీ, డెట్, బంగారం మిశ్రమాన్ని అందించే బహుళ-ఆస్తి కేటాయింపు నిధులను ఎంచుకోవచ్చు.

# వికెట్ల వెనుక మెరుపు వీరులు..అత్యధిక డిస్మిసల్స్ చేసిన టాప్-5 కీపర్లు వీరే



టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక డిస్మిసల్స్ (వికెట్ల వెనుక బ్యాటర్లను అవుట్ చేయడం) చేసిన వికెట్ కీపర్‌గా టీమిండియా లెజెండ్ ఎంఎస్ ధోనీ అగ్రస్థానంలో ఉండేవారు. అయితే ఫిబ్రవరి 9న కెనడాతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా స్టార్ వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ రెండు క్యాచ్‌లు పట్టడం ద్వారా ధోనీ రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం వీరిద్దరూ చెరో 32 డిస్మిసల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.టీ20 ప్రపంచకప్ 2026లో సౌతాఫ్రికా, కెనడా జట్ల మధ్య జరిగిన పోరులో క్వింటన్ డికాక్ ఒక అద్భుతమైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కెనడా ఓపెనర్లు దిల్‌ప్రీత్ బజ్వా, యువరాజ్ సామ్రాలు ఇచ్చిన క్యాచ్‌లను విజయవంతంగా అందుకున్న డికాక్.. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో తన 32వ డిస్మిసల్‌ను పూర్తి చేశాడు. దీంతో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ (32 డిస్మిసల్స్) సరసన నిలిచాడు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, ధోనీ ఈ రికార్డును 32 మ్యాచ్‌ల్లో సాధిస్తే, డికాక్ కేవలం 28 మ్యాచ్‌ల్లోనే ఈ ఫీట్ అందుకోవడం విశేషం.టాప్-5లో కొనసాగుతున్న దిగ్గజాలుప్రస్తుతం అత్యధిక డిస్మిసల్స్ చేసిన జాబితాలో క్వింటన్ డికాక్ (32), ఎంఎస్ ధోనీ (32) అగ్రస్థానంలో ఉండగా.. పాకిస్థాన్‌కు చెందిన కామ్రాన్ అక్మల్ 30 డిస్మిసల్స్‌తో మూడో స్థానంలో ఉన్నాడు. విండీస్ కీపర్ దినేష్ రామ్దిన్ 27 పాయింట్లతో నాలుగో స్థానంలో, శ్రీలంక దిగ్గజం కుమార్ సంగక్కర 26 డిస్మిసల్స్‌తో ఐదో స్థానంలో ఉన్నారు. ఇందులో డికాక్ మాత్రమే ప్రస్తుతం యాక్టివ్ క్రికెటర్‌గా ఉండటంతో, రాబోయే మ్యాచ్‌ల్లో ఆయన ఈ రికార్డును తిరగరాసి ఒంటరిగా అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది.వికెట్ల వెనుక విన్యాసాలుడికాక్ ఖాతాలో ఇప్పటివరకు 25 క్యాచ్‌లు, 7 స్టంపింగ్‌లు ఉన్నాయి. అదే సమయంలో ధోనీ ఖాతాలో 21 క్యాచ్‌లు, 11 స్టంపింగ్‌లు ఉన్నాయి. ఒకవేళ వచ్చే మ్యాచ్‌ల్లో డికాక్ మరో వికెట్‌ను తన కీపింగ్‌తో పడగొడితే, టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన వికెట్ కీపర్‌గా ఆయన చరిత్ర సృష్టిస్తాడు. ఇప్పటికే టీ20 ఇంటర్నేషనల్స్‌లో 100కు పైగా డిస్మిసల్స్ చేసిన ఏకైక కీపర్‌గా డికాక్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటున్నాడు.

# సెకన్లలోనే అకౌంట్లోకి పీఎఫ్ డబ్బులు యూపీఐ ద్వారా ఎలా విత్ డ్రా చేసుకోవాలంటే




ఈపీఎఫ్‌వో ఖాతాదారుల కోసం కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త యాప్‌ను విడుదల చేయనుంది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న ఏప్రిల్‌లో ఈ యాప్‌ను విడుదల చేసేందుకు కేంద్రం సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఈ యాప్ టెస్టింగ్ దశలో ఉంది. పీఎఫ్ సేవలకు ప్రస్తుతం ఈపీఎఫ్‌వో పోర్టల్, ఉమాంగ్ యాప్ ఉండగా.. కొత్త యాప్‌లో అన్నీ సేవలు ఒకేచోట లభించనున్నాయి. అన్నీ సేవలకు ఒకే ఫ్లాట్‌ఫామ్‌లా ఈపీఎఫ్‌వో కొత్త యాప్ ఉపయోగపడనుంది. జస్ట్ మొబైల్‌లో ఈ యాప్ ద్వారా పీఎఫ్‌కు సంబంధించిన అన్ని సేవలు పొందే సౌకర్యం లభించనుంది. దీని కోసం దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.
ఏయే సేవలంటే..?-యూపీఐ ద్వారా పీఎఫ్ బ్యాలెన్స్‌ను ఇన్‌స్టంట్‌గా సెకన్లలోనే విత్ డ్రా చేసుకోవచ్చు-ఎప్పటికప్పుడు పాస్‌బుక్ బ్యాలెన్స్ యాక్సెస్ చేసుకోవచ్చు-క్రెడిట్ హిస్టరీ, ఫండ్ స్టేటస్ అప్డేట్స్ తెలుసుకోవచ్చు-యూఏఎన్ పోర్టల్, ఉమాంగ్ యాప్ ఎప్పటిలాగే ఉంటాయి-100 డమ్మీ అకౌంట్లను ఉపయోగించి ఈ యాప్‌ను పరీక్షిస్తున్నారుఎలా విత్ డ్రా చేసుకోవాలంటే..?ఈపీఎఫ్ ఖాతాదారులకు సేవలను మరింత వేగంగా, సౌకర్యవంతంగా అందించాలనే లక్ష్యంతో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఆర్గనైజేషన్ ఈ కొత్త యాప్‌ను ప్రవేశపెడుతోంది. కొత్త ఈపీఎఫ్‌వో యాప్‌ను రెండు భాగాలుగా విభజిస్తారు. దీర్ఘకాలిక పదవీ విరమణ భద్రతను నిర్వహించుకోవడానికి ఒక భాగంగా ఉండనుంగా.. రెండో భాగంలో యూపీఐ ద్వారా నగదు ఉపసంహరించుకునే ప్రక్రియ ఉండనుంది. మీ బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేయబడిన యూపీఐ పిన్ నెంబర్‌ను ఎంటర్ చేసి మీరు పీఎఫ్ నగదును తక్షణం విత్ డ్రా చేసుకోవచ్చు. ఇప్పటివరకు పీఎఫ్ నగదు తీసుకోవాలంటే పోర్టల్‌లోకి వెళ్లి లేదా ఉమాంగ్ యాప్ ద్వారా క్లెయిమ్‌కు రిక్వెస్ట్ పెట్టుకోవాల్సి వస్తుంది. ఇందుకు అనేక డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. క్లెయిమ్‌కు దరఖాస్తు చేసుకున్న తర్వాత అకౌంట్లో జమ కావడానికి మూడు రోజుల సమయం పడుతుంది.8 కోట్ల మందికి లబ్ధిప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 8 కోట్ల మంది పీఎఫ్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. దాదాపు 5 కోట్లకుపైగా క్లెయిమ్‌లు ప్రాసెస్ చేయబడుతున్నాయి. దీంతో ఈ యూపీఐ ఆధారిత పేమెంట్స్ వ్యవస్థ క్లెయిమ్స్‌ను వేగవంతం చేయనుంది. అలాగే పరిపాలన పనిభారాన్ని కూడా తగ్గిస్తుంది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో ఈపీఎఫ్‌వోకు బ్యాంకింగ్ లైసెన్స్ లేకపోవడంతో పీఎఫ్ ఖాతాల నుంచి నేరుగా నిధులు తీసుకోవడం సాధ్యం కావడం లేదు. దీంతో బ్యాంకింగ్ ఫ్లాట్‌ఫామ్‌ల లాగే ఈపీఎఫ్‌వో సేవలను సమర్థవంతంగా, స్నేహపూర్వకంగా మార్చడానికి ఈపీఎఫ్‌వో కృషి చేస్తుంది.





# మా ఫ్యామిలీ జోలికొస్తే ఊరుకునేది లేదు

కాగా గతేడాది బ్రహ్మానందం అనే సినిమా ఈవెంట్‌లో చిరంజీవి వారసుడిపై కమెంట్స్ చేసారు.. ఇంటికి వెళ్తే లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉంటుందంటూ సరదాగా చేసిన కామెంట్స్ బాగా వివాదం అయ్యాయి. ఆ కామెంట్స్ ను గుర్తు చేస్తూ మొన్న రామ్ చరణ్-ఉపాసన దంపతులకు బాబు పుట్టిన వేళ చిరంజీవిని మళ్లీ ట్రోల్ చేసారు.. ఆ విమర్శలకు మెగా కోడలు, వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి గట్టిగా కౌంటర్ ఇచ్చారు.. సంతోషకరమైన క్షణాలను వివాదాస్పదం చేయడంపై అసహనం వ్యక్తం చేస్తూ, చిరంజీవి మహిళలను గౌరవించే తీరును ఆమె ట్వీట్ రూపంలో తెలియజేసారు.. ఇతరులను విమర్శించే ముందు వ్యక్తిగతంగా తెలుసుకోవాలని ఆమె ట్వీట్ చేశారు. నిజంగా ఆయన్ను, ఆయన కుటుంబంలో మహిళలను ఎలా చూసుకుంటారో తెలియనప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ లావణ్య తెలిపారు. ఈ కామెంట్స్ మీద ఇప్పుడు మరోసారి లావణ్య రియాక్ట్ అయ్యారు.. చిరంజీవి గారు ఇంట్లో ఎలా ఉంటారనేది తమకు తెలుసు అని.. తమ కుటుంబం జోలికి ఎవరైనా వస్తే అస్సలు ఊరుకోను అని చెప్పారు లావణ్యచిరంజీవి తన కుటుంబంలోని మహిళల్ని, ముఖ్యంగా తన మనవరాళ్లని ఎంత ప్రేమగా, గౌరవంగా చూస్తారో ఈ విమర్శలు చేసేవారికి అస్సలు అవగాహన లేదు. ఆయన చేసే పనుల్లో 1 శాతం కూడా చేయలేని వాళ్లు.. ఆయన వ్యక్తిత్వం గురించి మాట్లాడటం సరికాదు మా ఫ్యామీలీ జోలికొస్తే ఊరుకోనని చెప్పుకొచ్చిందికాగా పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తోన్న మరో చిత్రం 'సతీ లీలావతి'. ఇందులో లావణ్యకు జోడీగా దేవ్ మోహన్ నటిస్తున్నాడు. తాతినేని సత్య ఈ మూవీకి దర్శకత్వంవహిస్తున్నారు. అలాగే ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.





# ఆ హీరోనే నాకు ఇండస్ట్రీలో అన్ని విధాలా హెల్ప్ చేస్తున్నాడు

హైదరాబాద్ లో పుట్టి పెరిగిన శివాని నాగారం షార్ట్ ఫిల్మ్స్ తో కెరీర్ ప్రారంభించింది. మిస్టర్ లాంటి వెబ్ సిరీస్ లు చేసి యూట్యూబర్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక 2024లో అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిందీ అందాల తార. ఇన్ స్టాలో చూసి శివానీని చూసిన దర్శకుడు ఆమెకు సినిమా ఛాన్స్ ఇచ్చాడు. ఈ మూవీలో శివానీ నటనకు విమర్శకుల ప్రశంసలు కూడా వచ్చాయి. ఇక గతేడాది రిలీజైన లిటిల్ హార్ట్స్ సినిమాతో కుర్రాళ్లకు ఫేవరెట్ గా మారిపోయిందీ అందాల తార. అందులో కాత్యాయని పాత్రలో ఆమె నటనకు అందరూ ఫిదా అయిపోయారు. కాగా సాధారణ హీరోయిన్లలా కాకుండా చాలా సెలెక్టివ్ గా సినిమాలు చేస్తోంది శివాని. ఇందులో భాగంగా త్వరలోనే ఆమె హే భగవాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సుహాస్ హీరోగా నటిస్తున్నాడు. అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ తర్వాత మరోసారి హీరో, హీరోయిన్లుగా స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు సుహాస్- శివాని. గోపి అచ్చర తెరకెక్కిస్తోన్న ఈ సినిమా లో వెన్నెల కిశోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, యాంకర్ స్రవంతి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్లలో భాగంగా హీరో, హీరోయిన్లు వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ శివాని కో యాక్టర్, హీరో సుహాస్ పై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'నాకు సుహాత్‌తో ఇది రెండో సినిమా. వెరీ స్పెషల్ ఈ మూవీ నాకు.. ఎందుకంటే అంబాజిపేట మ్యారేజ్ బ్యాండ్ లో సుహాస్ నాకు అన్ని విషయాల్లో చాలా సపోర్టివ్‌గా నిలిచాడు. నాకు సినిమా ఇండస్ట్రీలో చాలా సపోర్టివ్ పర్సన్ అంటే సుహాసే. అతను నాకు చాలా హెల్ప్ చేశాడు. ఇప్పుడు ఈ సినిమా నాకు చాలా చాలా స్పెషల్. సుహాస్ తో మరో సారి స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా హ్యాపీగా ఉంది' అని చెప్పుకొచ్చింది శివానీ. ప్రస్తుతం ఈ బ్యూటీ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి

## కాస్తా నేను చెప్పేవరకు ఆగండి రూమర్స్ పై అనిల్ రావిపూడి రియాక్షన్



దక్షిణాది సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన దర్శకులలో అనిల్ రావిపూడి ఒకరు. ఈతరం ప్రేక్షకులకు కావాల్సిన అసలైన ఎంటర్టైన్మెంట్ అందిస్తూ సక్సెస్ అవుతున్నారు. బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంటూ సినీరంగంలో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. ప్రస్తుతం తెలుగు చిత్రపరిశ్రమలో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు. పటాస్ సినిమాతో దర్శకుడిగా తెరంగేట్రం చేశారు అనిల్ రావిపూడి. తొలి చిత్రంతోనే హిట్ అందుకున్నారు. ఆ తర్వాత వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఇక గతేడాది విక్టరీ వెంకటేశ్ తో కలిసి సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సంచలనం సృష్టించారు. పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్ డ్రామాగా వచ్చిన ఈ మూవీకి ఊహించని రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవితో కలిసి మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేశాడు. వీరిద్దరి కాంబోలో సంక్రాంతి పండక్కి వచ్చిన మన శంకరవరప్రసాద్ గారు సినిమాతో రూ.300 కోట్లకుపై వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు ఇదే మూవీ అటు ఓటీటీలోనూ దూసుకుపోతుంది. ఇదంతా పక్కన పెడితే.. మన శంకరవరప్రసాద్ గారు సినిమా సక్సెస్ తర్వాత అనిల్ రావిపూడి చేయబోయే ప్రాజెక్ట్ పై ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా ఫిల్మ్ వర్గాల్లో పలు రూమర్స్ వైరలవుతున్నాయి. అనిల్ రావిపూడి తన నెక్స్ ప్రాజెక్ట్ మరోసారి వెంకీతో చేయనున్నారని సమాచారం. అలాగే ఆ ప్రాజెక్టులో నటించే హీరోయిన్స్, టైటిల్, మ్యూజిక్ డైరెక్టర్ ఇలా ప్రతి విషయం ఫిక్స్ అయ్యిందని టాక్ నడుస్తోంది. అయితే ఈ రూమర్స్ పై తనదైన స్టైల్లో సెటైరికల్ ట్వీట్ చేశారు అనిల్ రావిపూడి. అన్నీ విషయాలు త్వరలోనే చెప్పేస్తానని అన్నారు."నేను పేపర్ మీద కలం కూడా పెట్టలేదు ఇంకా... నటినటులు, కథ, టైటిల్ కూడా పెట్టేసారు. ఈ ఫ్లో చూస్తుంటే .యాక్షన్..కట్ కూడా చెప్పేస్తారేమో ..మీ ఉత్సాహన్ని నేను అర్థం చేసుకోగలను.. అలాగే నేను చేసే సినిమా ఏంటి ఎవరితో అనేది అతి త్వరలో...నిజమైన పూర్తి వివరాలు...మీకు అందిస్తాం.." అంటూ బ్రహ్మానందం ఫన్నీ +ఆట షేర్ చేశారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి చేసిన ట్వీట్ వైరలవుతుండగా.. ఇప్పటివరకు నెట్టింట చక్కర్లు కొట్టిన రూమర్స్ అన్నింటికి చెక్ పడింది.




# వీటీటీూ కంప్లీట్ చేసిన ముద్దుగుమ్మ.. ఇప్పుడు ఇక డాక్టర్ శ్రీలీల

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. పెళ్లి సందడి సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ జోడిగా ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో ఓవర్ నైట్ స్టార్ అయ్యింది. దీంతో ఒక్కసారిగా ఆమెకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి. కొన్నాళ్లుగా ఈ బ్యూటీ నటించిన చిత్రాలన్నీ ఫ్లాప్ అవుతున్నాయి. సినిమాలు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయినా ఆఫర్స్ మాత్రం తగ్గడం లేదు. ఇటీవలే శివకార్తికేయన్ సరసన పరాశక్తి సినిమాతో తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఈ మూవీ నిరాశ పరిచింది. తాజాగా ధనుష్ నటిస్తున్న కొత్త సినిమాలో ఛాన్స్ కొట్టేసింది శ్రీలీల. ఇందులో సాయి పల్లవి సైతం నటిస్తుంది. ఇదిలా ఉంటే.. హీరోయిన్ శ్రీలీల కాస్త డాక్టర్ శ్రీలీల అయ్యింది. తాజాగా శ్రీలీల వైద్య పట్టా అందుకుంది. ఓవైపు సినిమాలు చేస్తూనే అటు ఎంబీబీఎస్ కంప్లీట్ చేసింది శ్రీలీల. ఆమె తల్లి గైనకాలజిస్ట్ కావడంతో చిన్నప్పటి నుంచే వైద్య రంగంపై ఆసక్తి పెంచుకుంది. సినిమాల షూటింగ్స్ లో పాల్గొంటూనే అటు వైద్య విద్యను పూర్తి చేసింది. 2023లో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ కంప్లీట్ చేసుకున్న ఆమె.. తాజాగానీప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.జబర్దస్త్ కమెడియన్..శ్రీలీల ఇంట్లో ఆమె తల్లితోపాటు అన్నయ్య కూడా డాక్టర్ అని పలు సందర్భాల్లో చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు కోలీవుడ్ లో , సాయి పల్లవి జంటగా నటిస్తున్న కొత్త ప్రాజెక్టులో నటిస్తుంది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటిస్తుంది.



# ఆ సినిమా చేస్తూ చాలా బాధపడ్డాను.

దర్శకుడు క్రిష్ జాగర్లమూడి ఓ ఇంటర్వ్యూలో తన చలనచిత్ర ప్రయాణంలో ఎదురైన అనేక అనుభవాలను, వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకున్నారు. గమ్యం సినిమా నిర్మాణ సమయంలో తాను తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నానని, ఒక సందర్భంలో కారులో ఒంటరిగా గట్టిగా అరిచానని తెలిపారు. అది కేవలం ఒక ఒత్తిడి పరిస్థితి అని, ఆ సంఘటనను పూర్తిగా గుర్తుంచుకోలేదని పేర్కొన్నారు. గౌతమీపుత్ర శాతకర్ణి ఆడియో ఫంక్షన్‌లో తన ఆవేశపూరిత ప్రసంగం గురించి వివరించారు. అది తెలుగువారి గతం, మూలం, చరిత్రను గర్వంగా చెప్పాల్సిన కథ అని, దానిని చెప్పలేదనే ఆవేదనతోనే అలా మాట్లాడానని స్పష్టం చేశారు. తన లక్ష్యం ఉత్తర భారతదేశంలో ఇంకా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను గుర్తించని వారికి తెలుగు ప్రజల గొప్పతనాన్ని చాటిచెప్పడమేనని తెలిపారు. ఈ సినిమా కోసం బాలకృష్ణ గారి లుక్ డిజైన్ గురించి మాట్లాడుతూ, కాన్సెప్ట్ ఆర్టిస్టులతో చేయించామని, బాలయ్య గారి సలహాలు కూడా తీసుకున్నామని చెప్పారు. లండన్ మ్యూజియంలోని మెకంజీ రాతప్రతులు, కుడ్య చిత్రాలను పరిశీలించి కాస్ట్యూమ్స్, ఆభరణాలను రూపొందించామని వెల్లడించారు. ఒక యుగ పురుషుడిని చూస్తున్న అనుభూతి కలిగించడమే తమ లక్ష్యమని తెలిపారు.కంచె సినిమా డైలాగ్స్ గురించి ప్రస్తావిస్తూ, సాయి మాధవ్ బుర్రా గారు రాశారని, కంటెంట్ తనదైతే ఆయన దానికి రూపకల్పన చేస్తారని వివరించారు. గులాబ్ పువ్వు నచ్చితే కోసుకుంటాం, ప్రేమిస్తే నీళ్లు పోస్తాం అనే డైలాగ్ ఒక కొటేషన్ అని, తన సొంతం కాదని స్పష్టం చేశారు. తన కెరీర్‌లో అత్యంత సంతోషకరమైన సంఘటనగా గమ్యం సినిమా విడుదలైన తర్వాత ఒక సామాన్యుడు "వీడు ఎవడో తెగ పుస్తకాలు చదివాడు, భలే తీశాడురా సినిమా" అని పొగడటాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ప్రస్తుతం చాలా మంది ఆశపడే స్థితిలో ఉన్నానని, కథలు చెప్పడానికి దేవుడు ఇచ్చిన అవకాశంగా దీనిని చూస్తానని తెలిపారు. వృత్తిపరంగా తనకు పెద్ద బాధాకర సంఘటనలు లేవని అన్నారు.

# : హీరో రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు



బాలీవుడ్ నటుడు నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు వచ్చినట్టు తెలుస్తుంది. రణ్‌వీర్ సింగ్‌కు గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ ద్వారా బెదిరింపులు వచ్చాయని పోలీసులు మంగళవారం తెలిపారు. వాయిస్ నోట్ ద్వారా బెదిరింపులు రావడంతో ఆయన ఇంటి చుట్టూ భద్రత పెంచినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఇటీవలే బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం పై కాలపు జరిగిన విషయం తెలిసిందే.. ఈ సంఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత రణవీర్ కు బెదిరింపులు రావడంతో బాలీవుడ్ లో ఆందోళన నెలకొంది.

ఇటీవలే దురంధర్ సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నాడు రణవీర్ సింగ్. ఈ సినిమా బాలీవుడ్ ఇండస్ట్రీని షేక్ చేసింది. మూవీ ఏకంగా రూ. 1000కోట్లకు పైగా వసూల్ చేసి నయా రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా పాకిస్థాన్ నేపథ్యంలో తెరకెక్కింది. ఈ క్రమంలో రణవీర్ సింగ్ కు బెదిరింపులు రావడంతో ఆయన అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Printed by SREE SESHA SAI ENTERPRISES Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY, printed at MEDCHAL MALKAJGIRI and published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY, RNI NO ; TGTEL/25/A0880, CONTACT : 94906 17666, 9490617567